ప్రజాశక్తి

సోమవారం 4 మార్చి 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా





మళ్లీ టెండర్లు!

- బిల్లుల చెల్లింపులో జాప్యంపై కాంట్రాక్టర్ల ఆందోళన
- తుపానుకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు అరకొర నిధులు
- కృష్ణాజిల్లాలో 143 కిలోమీటర్ల రోడ్లు ధ్వంసం
- శాశ్వత మరమ్మతులకు అవసరమైంది రూ.93.90 కోట్లు
- ప్రభుత్వం మంజూరు చేసింది రూ.16.66 కోట్లు మాత్రమే



ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

మిచౌంగ్ తుపానుకు దెబ్బతిన్న రహదారుల శాశ్వత మరమ్మతులకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదు. అరకొరగానే ఇచ్చిన నిధులతో తాత్కాలిక మరమ్మతులకు రహదారులు భవనాల శాఖ (ఆర్అండ్‌బి) ఒకటికి మూడు సార్లు టెండర్లు ఆహ్వానించినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. రహదారుల నిర్మాణాలకు సంబంధించి బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందనే ఆందోళనతో కాంట్రాక్టర్లు టెండర్ల దాఖలకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. దీంతో రహదారుల తాత్కాలిక మరమ్మతులు సైతం ఎప్పుటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

అరకొర నిధులు

కృష్ణాజిల్లాలో ఆర్అండ్‌బి రహదారులు 1473 కిలో మీటర్ల విస్తరించి ఉన్నాయి. మొత్తం 172 రోడ్లలో 30 రోడ్లకు సంబంధించి 143 కిలోమీటర్లుపైగా రోడ్లు తుపానుకు దెబ్బతిన్నాయి. పూర్తిస్థాయిలో తిరిగి పునర్నిర్మించడానికి రూ.93.90 కోట్లు వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. నివేదికలు ప్రభుత్వానికి పంపారు. అయితే తాత్కాలిక మరమ్మతులకు రూ.16.66 కోట్లు మాత్రమే ప్రభుత్వం మంజూరు చేసింది. అవసరమైన మొత్తంలో ఆరో వంతు మాత్రమే కేటాయించింది.

మళ్లీ టెండర్లు

2023 డిసెంబర్ నాలుగు, ఐదు తేదీల్లో వచ్చిన తుపానుకు దెబ్బతిన్న రహదారులకు అత్యవసర మరమ్మతులకు ప్రభుత్వం ఆలస్యంగా నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతోనే దెబ్బతిన్న రహదారులకు తాత్కాలిక మరమ్మతులకు ఆర్అండ్‌బి అధికారులు మూడు సార్లు టెండర్లు ఆహ్వానించారు. రూ.10.16 కోట్ల విలువైన మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్ల మరమ్మతులకు 35 వర్కులకు 23 వర్కులకు మాత్రమే టెండర్లు దాఖలయ్యాయి. 12 రోడ్లకు తిరిగి టెండర్లు ఆహ్వానిస్తున్నారు. స్టేట్ హైవేల మరమ్మతులకు సంబంధించి 14 వర్కులకు రూ.6.50 కోట్లతో టెండర్లు ఆహ్వానించగా 8 వర్కులకు టెండర్లు దాఖలయ్యాయి. ఆరు వర్కులకు మరోసారి టెండర్లు ఆహ్వానిస్తున్నారు.

బిల్లుల చెల్లింపుల్లో జాప్యం

రహదారుల మరమ్మతులు, నిర్మాణానికి సంబంధించి సుదీర్ఘకాలంగా కాంట్రాక్టర్‌లకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కృష్ణాజిల్లాలో జరిగిన వర్కులకు సంబంధించి రూ.120 కోట్లకు పైగా కాంట్రాక్టర్‌లకు చెల్లించాల్సి ఉంది. ఈ క్రమంలోనే తాత్కాలిక మరమ్మతులకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదని తెలుస్తోంది. ఈ క్రమంలో తుపానుకు దెబ్బతిన్న రహదారుల అత్యవసర మరమ్మతులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ డిల్లీరావు

పల్స్ పోలియో విజయవంతం

నేడు, రేపు ఇంటింటికీ క్యాంపెయిన్ : డిల్లీరావు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ

పుట్టిన బిడ్డ మొదలుకొని ఐదేళ్ల వయసులోపు గల చిన్నారులకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయాలన్న లక్ష్యంతో ఈ నెల 4, 5 తేదీల్లో ప్రతి ఇంటినీ సందర్శించి పోలియో చుక్కలు వేస్తామని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం విజయవాడ గవర్నర్‌పేటలోని సివిఆర్ మున్సిపల్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో కలెక్టర్ డిల్లీరావు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలియో మహమ్మారిని సమూలంగా రూపుమాపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత 20 సంవత్సరాలుగా తీసుకుంటున్న చర్యలు మంచి (మిగతా 6లో)



అంబేద్కర్‌నగర్ వాసులు చేపట్టిన దీక్షకు మద్దతు తెలుపుతున్న సిపిఎం నాయకులు

ఎన్నికలకు ముందే సమస్యలు పరిష్కరించండి

సిపిఎం ఆధ్వర్యంలో అరుణోదయనగర్ వాసుల ధర్నా

ప్రజాశక్తి-అజిత్ సింగ్‌నగర్

ఎన్నికలకు ముందు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విజయవాడ రాజరాజేశ్వరిపేట అరుణోదయనగర్ వాసులు ఆదివారం నిరసన దీక్ష చేపట్టారు. వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఇళ్ల పట్టాలిచ్చి రిజిస్ట్రేషన్ చేయాలని, బుడమేరు రైలు బ్రిడ్జి కింద రోడ్లు నిర్మించి లైట్లు వేయించాలని, డిస్నీల్యాండ్ స్థలాన్ని పేదలకు ఇళ్లస్థలాలుగా కేటాయించాలని నినాదాలు చేశారు. దీక్షకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్.బాబూరావు మద్దతు తెలిపి మాట్లాడుతూ డిస్నీల్యాండ్ స్థలంలో కబేలా ఏర్పాటును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 23 సంవత్సరాలుగా ఉంటున్న ఇళ్లకు తాము గెలిస్తే రిజిస్ట్రేషన్ చేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీని గెలిచాక మరిచిపోవడం టిడిపి, వైసిపికి అలవాటైపోయిందని మండిపడ్డారు. కార్పొరేషన్లో కమ్యూనిస్టుల హయాంలో తాను కార్పొరేటర్‌గా ఉన్న కాలంలో సింగ్‌నగర్, పాయకాపురం, రాజీవ్‌నగర్, కండ్రిక ప్రాంతాల్లో ఒక్క రూపాయి నుంచి 15 రూపాయల్లోపు నామమాత్రం ధరలకే 40 వేల మందికి పట్టాలు రిజిస్ట్రేషన్ చేయించినట్లు చెప్పారు. ఇళ్లకు రిజిస్ట్రేషన్ కావాలంటే చిత్తశుద్ధితో ప్రజల కోసం పని చేసే సిపిఎం కమ్యూనిస్టులు గెలుపొందడం అవసరమన్నారు. డబ్బు కట్టినా ఇల్లు రానివారు కొందరుంటే ఇల్లు కోసం దరఖాస్తు పెట్టుకొని స్థలం (మిగతా 6లో)

వేసవి వ్యాధులపై అప్రమత్తత అవసరం

కృష్ణాజిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి గీతాబాయి



ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

మార్చి మొదటి వారంలోనే ఎండల తీవ్రత అధికంగా ఉంటోందని, వేసవి వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కృష్ణాజిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి జి.గీతాబాయి అన్నారు. రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా స్పెషలిస్టు వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువెళ్లడంలో కృష్ణాజిల్లా రాష్ట్రంలో ముందంజలో ఉందని చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె వివరించారు.

ప్రశ్న : వేసవిలో ఎటువంటి వ్యాధులు వస్తాయి?

ఎండాకాలంలో కొన్ని రకాల వ్యాధులు వస్తాయి. వడదెబ్బ (సన్‌స్ట్రోక్)కు ఎక్కువగా గురవుతారు. పచ్చకామెర్లు, డయేరియా(అతిసార) తదితర వ్యాధులు ఎక్కువగా ప్రభలుతాయి.

ప్రశ్న : సన్ స్ట్రోక్‌కు గురవ్వకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

చిన్నపిల్లలు, వృద్దుల్లో ఎండవేడిమిని తట్టుకునే శక్తి ఉండదు. ఎండ అధికంగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో వెళ్ళాల్సి వస్తే ఎండ వేడి సంరక్షణకు గొడుగు ఉపయోగించాలి. నీరు ఎక్కువగా తీసుకోవాలి. ఎండల్లో ఎక్కువగా పనిచేసే ఉపాధి కార్మికులు, మున్సిపల్, పంచాయతీ వర్కర్లు, తాపీ పనివారు జాగ్రత్తలు తీసుకోవాలి. ఉపాధి కార్మికులు, మున్సిపల్, పంచాయతీ వర్కర్లు ఉదయం 11 గంటలలోపు పనులను



ముగించుకోవడం, సాయంత్రం ఎండవేడి తగ్గిన తర్వాత మాత్రమే పనులకు వెళ్లాలి. వేసవిలో కార్మికుల పని వేళలకు సంబంధించి సంబంధితశాఖల అధికారులకు త్వరలో సర్కులర్ అందిస్తాం. ఉపాధి కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని సంబంధితశాఖ అధికారులకు సూచిస్తున్నాం.

ప్రశ్న : వడదెబ్బ తగిలిన వారిలో ఎటువంటి లక్షణాలు ఉంటాయి?

ఎండలు పెరగడంతో శరీరం ఉష్ణోగ్రతలను నియంత్రించుకోలేని స్థితికి చేరుతుంది. శరీరంలో ఎలక్ట్రోలైట్స్, మినరల్స్, నీటిశాతం తగ్గి (డీహైడ్రేషన్) సత్తువ లేని స్థితికి చేరుతుంది. శరీరంలో ఉష్ణోగ్రతలు పెరిగి చెమటలు పట్టడం, దాహం తీరకపోవడం, గుండె వేగంగా కొట్టుకోవడం, కండరాలు గట్టిపడటం, మూర్ఛరావడం, తలనొప్పి తదితర లక్షణాలు వస్తాయి. కొన్ని సందర్భాల్లో కోమాలోకి వెళతారు. ఈ లక్షణాలు కనిపించిన వ్యక్తిని కుటుంబసభ్యులు సమీప ఆరోగ్యకేంద్రాల్లోని వైద్యుల వద్దకు తీసుకు వెళ్ళాలి.

ప్రశ్న: డయేరియా, టైపాయిడ్, కామెర్లు, నివారణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

జ: నీటి, ఆహార కాలుష్యం కారణంగానే ఈ వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయి. అతిసారం వచ్చిన వారికి నీళ్ల విరేచనాలు ,వాంతులు అవుతాయి. కడుపు నొప్పి ఉంటుంది. టైఫాయిడ్ వచ్చిన వారిలో అతి జ్వరం, అలసట, నిస్సత్తువ, కడుపునొప్పి, తలనొప్పి, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. పచ్చకామెర్లు ఉన్న వారిలో మూత్రం పచ్చగారావడం, ఆకలి మందగిస్తుంది. జ్వరం తలనొప్పి, వళ్లు నొప్పి వంటి లక్షణాలు ఉంటాయి. ఈ వ్యాధులు రాకుండా శుభ్రమైన నీటిని, ఆహార పదార్ధాలను తీసుకోవాలి. పంచాయతీలు, మున్సిపాల్టీల్లో సరఫరా చేసే తాగునీటిని క్లోరినైజేషన్ చేయాలని, నీరు సరఫరా అయ్యే పైప్‌లకు లీకులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించాం.

ప్రశ్న : వేసవి వ్యాధులపట్ల అవగాహన కల్పిస్తున్నారా?

జిల్లాలోని 63 పిహెచ్‌సి, (మిగతా 6లో)

సుధాకర్‌కి కళాభూషణ్ బిరుదు


సుధాకర్‌ను అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - చందర్లపాడు: మండలం లోని పోక్కు నూరు గ్రామానికి చెందిన దొండపాటి సుధాకర్‌కు ఐఎస్ఒ గుర్తింపు పొందిన సామాజిక సేవాసంస్థ పద్మభూషణ్ గుర్రం జాషువా కళాపరిషత్ దుగ్గిరాల, వారి 36వ వార్షికోత్సవం సందర్భంగా సాహితీ సామ్రాట్ డాక్టర్ పెద్దీటి యోహాను నిర్వహించిన అవార్డ్ ప్రదానోత్సవ కార్యక్రమం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అంగరంగ వైభవంగా జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బంగారు నంది అవార్డ్ గ్రహీత దొండపాటి సుధాకర్‌ని కళాభూషణ్ బిరుదుతో సత్కరించారు. దొండపాటి సుధాకర్ మాట్లాడారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తిరువూరు : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌ను తట్టుకోలేక తిరువూరు మండలం, కాకర్ల గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన కోట విశ్వనాథం కుటుంబానికి టిడిపి విజయవాడ పార్లమెంటు అభ్యర్థి కేశినేని శివనాథ్ ఎన్టీఆర్ ఛారిబుల్ ట్రస్ట్ ద్వారా మంజూరైన రూ.మూడు లక్షల చెక్కును ఆర్థిక సాయం కింద అందజేశారు. రాష్ట్రంలో త్వరలోనే టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి రానుందని, పేద ప్రజల అభ్యున్నతి కోసం అధినేత చంద్రబాబు పరిపాలన కొనసాగుతుందని కేశినేని చిన్ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ బోర్డు మాజీ ఛైర్మన్ షేక్ నాగూర్ మీరా, టిడిపి తిరువూరు నియోజకవర్గ అభ్యర్థి కె.శ్రీనివాసరావు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నూతన పాలకవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎపిఎస్ఇబి ఇంజనీర్స్ అసోసియేషన్, డాక్టర్ ఎన్టీటీపీఎస్ బ్రాంచ్ 2023–25 సంవత్సరానికి గానూ, పాలకవర్గ ఎన్నికలు స్థానిక ఇంజనీర్స్ అసోసియేషన్ హాల్‌లో జరిగాయి. ఈ ఎన్నికల్లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కెవిఆర్ చక్రపాణి బ్రాంచ్ సెక్రెటరీగా, యు.వెంకట్రావు కోశాధికారిగా గెలుపొందారు. బ్రాంచ్ సెక్రటరీ పదవికి కెవిఆర్ చక్రపాణి, దేవరపల్లి శ్రీధర్ పోటీ పడగా చక్రపాణి శ్రీధర్‌పై 52 ఓట్ల తేడాతో విజయం సాధించారు.



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం, భవానీపురం, వన్ టౌన్, టూ టౌన్ ల పరిధిలోని రౌడీ షీటర్స్, లా అండ్ ఆర్డర్ సస్పెక్ట్ షీటర్స్, క్రైమ్ సస్పెక్ట్ షీటర్స్, గంజాయి స్మోకర్స్, సెల్లర్స్‌కు సార్వత్రిక ఎన్నికల దష్ట్యా ఏవిధ మైన చట్ట వ్యతిరేకమైన పనులు చేయ కుండా అసాంఘిక కార్యక్ర మాలు, అవాంచ నీయ సంఘటనలకు పాల్పడకుండా, ప్రజాశాంతికి భంగం కలిగించకుండా మసులు కోవాలని లేనియెడల చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, గంజాయి తాగడం వల్ల అమ్మడం వల్ల కలిగేటువంటి చెడు ప్రభావాలు, నష్టాలు సంబంధించి సిపి కృష్ణకాంత్, పశ్చిమ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ మురళీకృష్ణ రెడ్డి కౌన్సిలింగ్ ఇచ్చారు.

టిడిపి కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - మైలవరం : రాష్ట్ర ప్రజల కోసం, భావితరాల భవిష్యత్తు కోసం టిడిపి జనసేన సంకీర్ణ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం ఉందని టిడిపి ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని పొందుగల గ్రామంలో ఆదివారం టిడిపి మేనిఫెస్టోకు సంబంధించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోసేసారని మరోసారి పొరపాటు జరిగితే రాష్ట్రానికి ఉనికి ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో తనకు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్


జగ్గయ్యపేట


మైలవరం


వత్సవాయి



విజయవాడ

ప్రజాశక్తి మైలవరం : ప్రశాంత వాతావరణంలో త్వరలో జరగనున్న ఎన్నికలను నిర్వహించాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మైలవరంలో ఆదివారం కేంద్ర సాయుధ బలగాలతో మైలవరం సర్కిల్ ఏసిపి మురళీమోహన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ నుండి పంచాయతీ సెంటర్ వరకు ఫ్లాగ్ మార్చి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లా అండ్ ఆర్డర్ విషయంలో ప్రత్యేకమైన కేర్ తీసుకుంటున్నామన్నారు. ప్రతి పోలీసు ప్రజలకు అండగా ఉంటామన్నారు. రకరకాల ప్లాన్ ఆక్టివిటీలు ఏర్పాటు చేసుకొని గ్రామాల్లో ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ కిషోర్ బాబు, మైలవరం సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** విజయవాడ కమిషనర్ ఆఫ్ పోలీస్ క్రాంతి రాణా టాటా ఆదేశాల మేరకు రూరల్ డిఎస్‌పి కె.శ్రీనివాసరావు, నందిగామ డిఎస్‌పి డాక్టర్ రవి కిరణ్ సారథ్యంలో, జగ్గయ్యపేట, కంచికచర్ల సిఐలు జానకిరాం, చంద్రశేఖర్ పర్యవేక్షణలో రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలో సమస్యాత్మక ప్రాంతాల్లో సాయుధ బలగాలు మరియు పోలీసు సిబ్బందితో ఆదివారం ఉదయం 11 గంటలకి ప్రజలలో ధైర్యాన్ని నింపే ఉద్దేశ్యంతో పోలీసు కవాతు ఎన్టీఆర సర్కిల్ నుండి నిర్వహించారు. **వత్సవాయి :** అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు, గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు ఎవరైనా పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వత్సవాయి ఎస్ఐ అభిమన్య జగ్గయ్యపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ జానకి రాము అన్నారు. మండలంలోని లింగాల, వత్సవాయి, ఖమ్మంపాడు, తదితర గ్రామాల్లో పోలీస్ బెటాలియన్‌తో గ్రామాల్లో ర్యాలీ చేపట్టారు. **విజయవాడ :** రానున్న ఎన్.టి.ఆర్.జిల్లా 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణ కొరకు ప్రజలకు మేమున్నాం అనే భరోసా ఇచ్చేందుకు నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా ఆదేశాల మేరకు ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనరేట్ పరిదిలోని ముఖ్య ప్రదేశాలలో ఫ్లాగ్‌మార్చ్‌లు నిర్వహించారు. డిసిపిలు కృష్ణకాంత్ పాటిల్, కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వై.ఎస్.ఆర్ కాలని, అంబాపురం ఏరియాలలో ఆయా డివిజన్ల ఇన్‌స్పెక్టర్లు, సుమారు 300 మంది సివిల్, ఏ.ఆర్. పారామిలటరీ బలగాలు, ఏ.పి.ఎస్.పి. పోలీసులు పాల్గొన్నారు.

మురళి సేవలు అభినందనీయం

మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర


మురళిని సన్మానించిన ఛైర్మన్, తదితరులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని స్థానిక ఫైర్ స్టేషన్‌లో జరిగిన మురళి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ శ్రీరంగాపురం రాఘవేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఎల్లప్పుడూ ఉత్సాహంగా ఉంటూ, జగ్గయ్యపేట పట్టణంలో ఎటువంటి ఇబ్బంది రాకుండా ప్రమాదాలకు గురైనప్పుడు, హుటాహుటిన స్పందిస్తూ ప్రాణనష్టం, ఆస్తి నష్టం వాటిల్లకుండా ఇన్ని రోజులు చేసిన సేవలకు జగ్గయ్యపేట పట్టణ ప్రజలందరూ రుణపడి ఉంటారని అన్నారు. భవిష్యత్తులో కూడా ఆయన సలహాలు, సూచనలు జగ్గయ్యపేట పట్టణ ఫైర్‌స్టేషన్‌కు, తమలాంటి వారికి అందజేయాలని ఆయన కోరారు.

ఉద్యమాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం


ప్రసంగిస్తున్న పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు పి.టాన్య వేదికపై ఓబులేసు, జాస్తి కిషోర్, చిట్టిపాటి తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ : దేశంలో రాజకీయాలు పూర్తిగా భ్రష్టు పట్టి పోయాయని, పదవులు, అధికారం కోసం రోజుకొక పార్టీ మారుతూ ఉన్నారని కమ్యూనిస్టు ఉద్యమంలో ఉన్న చీలికల్ని ఆసరాగా చేసుకుని కార్పొరేట్లు, కోటీశ్వరులు రాజకీయాల్లోకి వస్తున్నారని ఇటువంటి తరుణంలో సంఘటిత ఐక్య ఉద్యమాలు అవసరం అని పలువురు అభిప్రాయ పడ్డారు. అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మరణించిన సిపిఐ ఎమ్.ఎల్ (న్యూ డెమోక్రసీ) సీనియర్ నాయకులు కూరపాటి రామారావు సంస్మరణసభ ఆదివారం నగరంలోని స్థానిక మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం హాల్‌లో జరిగింది. న్యూ డెమోక్రసీ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు పి.టాన్యా ప్రసంగిస్తూ తెలంగాణా సాయుధ పోరాటం, శ్రీకాకుళ అమరుల త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం అన్నారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, ఎమ్ఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాస్తి కిషోర్ ఇఫ్టు కార్యదర్శి పి ప్రసాద్, లిబరేషన్ పార్టీ నాయకులు డి.హరనాథ్ మాట్లాడుతూ రామారావుతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పార్టీ రాష్ట్ర నాయకులు సిఎస్.సాగర్ అధ్యక్షత వహించగా భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.మోహన్, ఉపాధ్యక్షులు ఎమ్.రామకృష్ణ, అరసం అరుణకుమార్, రెడ్ ఫ్లాగ్ పార్టీ నాయకులు మరీదు ప్రసాద్ ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్ విష్ణు, అరుణోదయ సాంస్కతిక సమాఖ్య అధ్యక్షులు జాలయ్య ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, రామారావు సతీమణి విజయ సందేశం ఇచ్చారు.

వైసిపి ప్రచారం ముమ్మరం

ప్రజాశక్తి - తిరువూరు : వైసిపి తిరువూరు నియోజకవర్గ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాస్ తన ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గుడ్‌మార్నింగ్ తిరువూరు కార్యక్రమంలో భాగంగా ఆయన వైసిపి నాయకులతో కలిసి ఆదివారం 10వ వార్డు పరిధిలోని సుందరయ్య కాలనీలో పర్యటించారు. ఇంటింటికెళ్లి జగన్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు వివరిస్తూ మరొకసారి వైసిపికి ఓటేసి తిరువూరు నియోజకవర్గంలో తనను గెలిపించి జగన్ ముఖ్యమంత్రి చేయాలని కోరారు. నగర పంచాయతీ ఛైర్పర్సన్ గత్తం కస్తూరిబాయి, వార్డు కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, కాకర్లమూడి సుందర్ కుమార్, వైసిపి నాయకులు చలమాల సత్యనారాయణ పాల్గొన్నారు.

ముక్త్యాల విఆర్ఒ కోటయ్య మృతి



ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని ముక్త్యాల గ్రామ విఆర్ఒ కందుకూరి కోటయ్య (55) ఆదివారం గుండెపోటుతో విజయవాడలోని ఆంధ్రఆస్పత్రిలో మృతి చెందారు. మతుడు కోటయ్య స్వగృహం మండలంలోని అన్నవరం గ్రామం. మతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కోటయ్య మృతి పట్ల రెవెన్యూ శాఖ ఉద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతి తెలిపారు. కోటయ్య అంత్యక్రియలు సోమవారం స్వగ్రామం అన్నవరంలో జరగనున్నాయి.

6 నుండి తిరుమలగిరిలో మాలధారణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ స్వామి వారి దేవస్థానంలో పవిత్ర శ్రీ వేంకటేశ్వరస్వామి వారి మాలాధారణ కార్యక్రమం మార్చి 6వ తేదీ నుండి ప్రారంభించనున్నట్లు దేవాలయ చైర్మన్ కొమరగిరి భరద్వాజ్, ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి రామకష్ణమాచార్యులు తెలిపారు. ఈ నెల 6 నుండి 13వ తేదీ వరకు దీక్ష మాలధారణ శ్రీ స్వామివారి సన్నిధిలో ఆలయ అర్చకుల చేత మాలాధారణ చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా అర్ధమండల దీక్షలు మార్చి 22 నుండి ఏప్రిల్ 2వ తేదీలోపు అర్ధ మండల దీక్ష మాలధారణ ఉంటుందని తెలిపారు.

ఖైదీలకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని సబ్‌జైల్‌ను ఆదివారం ప్యానల్ అడ్వకేట్ దాసరి నాగేశ్వరరావు, జైల్ సూపరింటెండెంట్ ఎం పట్టాభి రమణతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలను జైల్‌లో గల మౌలిక సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిఎల్‌విఎం.నరేష్ పాల్గొన్నారు.

భద్రతా చర్యలపై దృష్టి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : సార్వత్రిక ఎన్నికల 2024 దష్ట్యా భద్రతా చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం విజయవాడ నగర పోలీస్ కమిషనరేట్ పశ్చిమ డివిజన్ కు వందమంది సిఐ ఎస్ ఎఫ్ బలగాలను ఎలక్షన్ బందోబస్తు నిమిత్తం కేటాయించడం జరిగింది. వారికి ఇబ్రహీంపట్నం ఏ కాలనీ ఆడిటోరియం వద్ద సిఐఎస్ ఎఫ్ కమాండెంట్ హిమాన్షు, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్యనారాయణ సార్వత్రిక ఎన్నికల్లో బందోబస్తులో భాగంగా భద్రతా చర్యలు మరియు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సూచనలు చేయడం చేశారు.

బూత్ కమిటీ సభ్యులతో సమావేశం

ప్రజాశక్తి - నందిగామ : గ్రామాల్లో 98 శాతం గృహాలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి అందించామని ఎంఎల్సి మొండితోక అరుణ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం చందర్లపాడు గ్రామంలో బూత్ నెం. 17, 18, 19 ల బూత్ కన్వీనర్లు, బూత్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంఎల్సి మ్నొండితోక అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన మంచిని ప్రతి ఇంటికి వెళ్లి వివరించాల్సిన బాధ్యత.. ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో పెత్తందారులకు – పేదలకు మధ్య ఎన్నికల యుద్ధం జరగబోతుందన్నారు.

వైద్యానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మండల పరిధిలోని జూపూడి గ్రామానికి చెందిన జంగా చెంచారావు గత కొంతకాలంగా అనారోగ్యం తో బాధపడుతున్నాడు. కుటుంబ పెద్ద అనారోగ్యంతో బాధపడుతూ ఉండటంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రామినేని రాజశేఖర్ (రాజా) పార్టీ తరపున 10 వేలు ఆర్థిక సహాయం కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు అవిటి రాజేశ్వరరావు, జిల్లా రైతు కార్యదర్శి సైకం సాంబశివరావు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వీరమ్మ తిరునాళ్లకు పోటెత్తిన యాత్రికులు





ప్రజాశక్తి-ఉయ్యూరు : వీరమ్మతల్లి తిరునాళ్లకు ఆదివారం భక్తులు పోటెత్తారు. తిరునాళ్లలో చివరి ఆదివారతో పాటు సోమవారంతో తిరునాళ్ళ ముగియనుండగా భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలనుంచి వ చ్చిన భక్తులతో అమ్మవారి ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలు కిక్కిరిసి జనసంద్ర ంలా కన్పించాయి. వేకువజామునుంచి భక్తులు అమ్మవారి ఆలయ ప్రదక్షిణ చేసి పాలపొంగళ్లతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు అ మ్మవారి దర్శనానికి ఏర్పాటుచేసిన క్యూలైన్లతో పాటు ఆలయ ప్రాంగణంలో ఎండలో నిలబడ్డారు. పెద్దయెత్తున తరలివచ్చిన భక్తులు అమ్మ వారిని దర్శించుకునేందుకు ఆల య గేట్లు వద్ద గుమి కూడి తోపులాడుకున్న పరిస్థితుల్లో వారిని అదుపుచేసి లైనులో పం పేందుకు పోలీసులు అవస్థలు పడ్డారు.



భక్తులకు ప్రసాదం పంపిణీ

వీరమ్మ తిరునాళ్ళలో భక్తులకు ఆదివారం వివిధ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు ప్రసాదం పంపిణీచేశారు. తిరునాళ్లకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరాగా వారికి ప్ర సాదం, త్రాగునీరు, మజ్జిగ పంపిణీచేశారు. లావణ్యాజ్యువలరీస్ అధినేత, వాకర్స్ అసోస యేషన్ సభ్యుడు గుండా తులసీరామ్ కుటుంబ సభ్యులతో కలసి ప్రసాదం పంపిణీచే శారు. తిరునాళ్లలో భక్తులకు ప్రసాదం పంపిణీచేసి సేవలందించడం మహాభాగ్యం భా విస్తున్నట్టు పేర్కొన్నారు.



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-చల్లపల్లి : అవనిగడ్డ డి.ఎస్.పి మురళీధర్ఫ్, చల్లపల్లి సిఐ సిహెచ్ నాగప్రసాద్ ఆదేశాల మేరకు ఎస్సై సిహెచ్ చినబాబు స్థానిక పోలీస్ స్టేషన్లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు . రాబోయే జనరల్ ఎలక్షన్స్ దష్ట్యా చల్లపల్లి పోలీస్ స్టేషన్ నందు రౌడీషీట్ కలిగి ఉన్న వారిని ఆదివారం పోలీస్ స్టేషన్కు పిలిపించారు. కౌన్సిలింగ్ ఇచ్చిన అనంతరం ఇకపై ఎలాంటి గొడవలకు గానీ అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనిన యెడల వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి పంపించారు.

నేడు కలెక్టరేట్లో 'స్పందన'

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లా మచిలీపట్నం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10: 30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి. రాజా బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఆయా శాఖల ఉన్నతాధికారులు స్పందన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే డివిజన్, మండల స్థాయిలోనూ స్పందన కార్యక్రమం నిర్వహిస్తారని, ప్రజలు తమ అర్జీలను మండల, డివిజన్ స్థాయిలోనూ సమర్పించ వచ్చునని కలెక్టర్ తెలిపారు.

బాలయోగికి ఘన నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : మాజీ లోక్‌సభ స్పీకర్, కీర్తిశేషులు జిఎంసి బాలయోగి 22వ వర్ధంతిని అవనిగడ్డ టిడిపి పార్టీ కార్యాలయంలో నిర్వహించారు.ఆయన చిత్రప టానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా బాలయోగి రాష్ట్రానికి చేసిన సేవలను కొని యాడారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, మాచవరపు ఆది నారాయణ, బండి రాఘవ, బచ్చు రఘునాథ్, మేడికొండ విజయ్, వెంకట పిచ్చయ్య, ఘంటసాల రాజమోహన్రావు, మండలి రామ్మోహన్రావు తదితరులు పాల్గొన్నారు.



బాలయోగి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

వెంకటేశ్వరరావు మృతికి నివాళి

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం మాజేరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త కాగిత వెంకటేశ్వర్లు (వేణ ుగోపాల స్వామి గుడిలో పూజారి) శని వారం అనా రోగ్య ంతో చనిపో యారు. విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రాం(రాజా) ఆదివారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంంతాపం ప్రకటించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మోర్ల రాంబాబు, మండల మైనార్టీ నాయకులు షేక్ నభీ ఘోరి, సీనియర్ ఎం. నాని స్థానిక నాయకులుమురాల అగ్గిరాముడు, తలుపుల రత్నరావులు ఉన్నారు



కాగిత వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మండలి వెంకట్రాం

చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి- నందిగామ : 11వ ఆల్ ఇండియా యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్ కాంపిటీషన్, ఎగ్జిబిషన్ డ్రీమ్ వర్క్ ఆర్ట్ గ్యాలరీ సంయుక్తంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో అపోలో విద్యాసంస్థలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు గోల్డ్ మెడల్స్ ను 8మంది విద్యార్థులు.. సిల్వర్ మెడల్స్ 7 గురు విద్యార్థులు సాధించారు. కెఎల్-యూనివర్సిటీలో బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చదువుతో పాటుగా చిత్రలేఖనంలో కూడా సమానంగా ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పిల్లలు హావభావాలు ను చిత్ర లేఖనం ద్వారానే వ్యక్తపరుస్తారని తెలిపారు..ప్రమోద్ కుమార్, పట్నాయక్, లీలా టీచర్లను స్కూల్ చైర్మన్ కాపా రవీంద్రనాథ్ అభినందించారు.

ఉషారామ కళాశాలకు అరుదైన గౌరవం



ప్రజాశక్తి-ఉంగుటూరు : జెయన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల కాకినాడ వారి నుండి అరుదైన విశిష్టత ఉషారామ ఇంజనీరింగ్ కళాశాలకు లభించిందని తేలప్రోలు ఉషారామ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి వి కె ఎస్ వి ప్రసాద్ అన్నారు. ఆదివారం విలేకరులతో ప్రసాద్ మాట్లాడుతూ ఉషారామ ఇంజనీరింగ్ కళాశాలకు జె యన్ టి యు కాకినాడ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన రెండు బ్రాంచీలలో పరిశోధనా కేంద్రాలను మంజూరు చేసిందని, తద్వారా కంప్యూటర్ సైన్స్ మరియు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాలలో పరిశోధనలకు ఉషారామ ఇంజనీరింగ్ కళాశాల వేదికగా అవకాశం రావడంతో ఇంజనీరింగ్ విద్యార్థులకు పరిశోధనలలో మరింత ఎక్కువ అవగాహనకు దోహదపడుతుందని అన్నారు. అంతే కాకుండా తమ కళాశాలలో పిహెచ్‌డి, యువ, పరిశోధకులకు అవకాశం ఉంటుందని, ఈ అవకాశాన్ని కల్పించిన జె యన్ టి యు కాకినాడ వారికి కతజ్ఞతలు అని అన్నారు. అనంతరం జె యన్ టి యు వారి నుండి వచ్చిన అనుమతి పత్రాలను చైర్మన్ సుంకర రామబ్రహ్మం నకు అందించారు. పరిశోధనా కేంద్రాలను మంజూరు చేసిన జె యన్ టి యు వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి వి ఆర్ ప్రసాదరాజు కు తమ కళాశాల సిబ్బంది తో రామబ్రహ్మం క్రతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుర్రా రాజశేఖరరావు పాల్గొన్నారు.

శాంతి రథం,ఫ్రీజర్ బాక్సులు ప్రారంభం

ప్రజాశక్తి-గన్నవరం : మానవతా సేవా సంస్థ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో శాంతి రథం (మహా ప్రస్థానం), రెండు ఫ్రీజర్ బాక్సులను ఆదివారం ప్రారంభించారు. మానవతా సేవా సంస్థ వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డి, సంస్థ రాష్ట్ర అధ్యక్షులు మారుబోయిన కోటేశ్వరరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. శాంతి రథాన్ని పుణ్య చారిటీస్ కార్యదర్శి జాస్తి విజయ భూషణ్ కుమార్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మడుపల్లి బాల కష్ణ మూర్తి, వారి సోదరుడు విజయకుమార్ ఏర్పాటు చేయగా, ఫ్రీజర్ బాక్సులను మానవత సంస్థ ఏర్పాటు చేసింది. ఇవి గన్నవరం పరిసర ప్రాంత ప్రజలకు ఉచితంగా సేవలు అందిస్తాయని బాలకష్ణ తెలిపారు. వీటిని పరిసర ప్రజలు తమ అవసరార్థం ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం మానవత సేవా సంస్థ గన్నవరం శాఖ కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షులుగా మడుపల్లి బాల కష్ణ మూర్తి, కార్యదర్శిగా కర్రా వరప్రసాద్, కోశాధి కారిగా పొట్లూరి రామక్రిష్ణ సహా ఎడుగురితో కార్యవర్గం, 15 మంది సలహాదారులతో కొత్త శాఖ ఏర్పాటు అయింది. ఈ సంద ర్భంగా జరిగిన సమావేశానికి సభ్యులు పెద్దఎత్తున హాజరయ్యారు.



మాట్లాడుతున్న రామచంద్ర రెడ్డి



కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో వేచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఆదివారం ఉమ్మడి జిల్లాల నుండి సుమారు 15 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి వారి యొక్క మొక్కుబడులు తీర్చుకున్నారు. దేవస్థానానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాటు చేసినట్లు దేవస్థానం పాలకమండలి చైర్మన్ శేషం వీర వెంకట కష్ణమూర్తి, ఆలయ కార్య నిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు.

బొమ్మిశెట్టి నియామకం అభినందనీయం : మొండితోక



మాట్లాడుతున్న ఎంఎల్‌సి మొండితోక అరుణ్ కుమార్

ప్రజాశక్తి- నందిగామ : రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన సీనియర్ వైసీపీ నాయకులు బొమ్మిశెట్టి భాస్కరరావు సేవలు ఎంతో అవసరమని నందిగామ ఎంఎల్ఏ మ్మొండితోక జగన్ మోహన్ రావు, ఎంఎల్సి మొండితోక అరుణ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం నందిగామలో బొమ్మిశెట్టి భాస్కరరావును శాలువాతో సత్కరించారు. వీరులపాడు మండలం నరసింహారావుపాలెం గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియామకం అవ్వడం అభినందనీయ మన్నారు. బొమ్మిశెట్టి భాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గా తనకు అవకాశం కల్పించి.. తన నియామకానికి కషి చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లకు రుణపడి ఉంటానని తెలిపారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కాపుల సంక్షేమానికి, అభివద్ధికి తన వంతు కషి చేస్తానని వెల్లడించారు .ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ ఏసిపి రవికిరణ్ ఆదేశాల మేరకు సిఐ హనీష్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ వాహనాలు తనిఖీ నిర్వహించారు. నందిగామ పట్టణం గాంధీ సెంటర్లో ఆదివారం సాయంత్రం, మైనర్ బాల బాలికలు వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని నందిగామ ట్రాఫిక్ ఎస్సై నరేష్ అన్నారు. వాహనదారులకు ట్రాఫిక్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు మైనర్ బాలబాలికలకు వాహనాలు ఇవ్వొద్దని, మైనర్లు ట్రాఫిక్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - గంపలగూడెం : గ్రామాల్లో ఏ ఒక్కరూ నేరాలకు పాల్పడకూడదని తిరువూరు సిఐ ఎస్కే నభి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అఖిలపక్ష నాయకులు, ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్సై ఎస్.శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన ఈ కార్యక్రమంలో నభి మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి సమస్యలో ఇరుక్కుంటే ఉన్నత చదువులకై సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని వివరించారు. ప్రతి నాయకుడు, ప్రతి ఓటరు ఎన్నికల నేపథ్యంలో పోలీసులతో సహకరించాలని కోరారు.

ప్రయివేటు పాఠశాలలను ప్రభుత్వం ఆదుకోవాలి

అన్ ఎయిడెడ్ ప్రయివేటు స్కూల్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రవీణ్



మాట్లాడుతున్న ప్రవీణ్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : చిన్న బడ్జెట్ ప్రయివేట్ పాఠశాలలను ప్రభు త్వం ఆదుకోవాలని, జివోల తో ఇబ్బందులు పెట్టకుం డా తమకు సహకారం అందించాలని అన్ ఎయిడెడ్ ప్రయివేట్ స్కూల్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రవీణ్ కంటి మహంతి అన్నారు. నగరంలోని హోటల్ ఐలాపురంలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రయివేటు విద్యా వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న చిన్న బడ్జెట్ ప్రయివేటు పాఠశాలల కొరక ఒక ప్రత్యేకమైన వేదికను ఏర్పాటుచేసి సమస్యలను విన్నవించుకుంటున్నామన్నారు. కోవిడ్ కారణంగా ప్రయివేటు పాఠశాలల పరిస్థితి ఆందోళనకరంగా మారిందని, దీనికి తోడు అప్రజాస్వామిక నిబంధనలు పెడుతూ ప్రస్తుతం ఉన్న జివో ఎంఎస్‌నెంబర్ 1కి వ్యతిరేకంగా రోజుకొక కొత్త జివో తెస్తూ తీవ్ర ఇబ్బందులను గురిచేస్తున్నారన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సుదర్శన్ మాట్లాడుతూ తీవ్ర ఇబ్బందులలో ఉన్న ప్రయివేటు పాఠశాలలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు గొల్లపూడి మోహనరావు, తిరుపతిరావు, కె.రత్నంచ సి.హెచ్.ప్రసాదు, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం : కేశినేని



ప్రజాశక్తి - వన్‌టౌన్ : భవానీపురంలో సూపర్ డూపర్ షటిల్ అసోసియేషన్ ఆత్మీయ ఆహ్వానం మేరకు ఎంపి కేశినేని నాని, పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ హాజరయ్యారు. భవానీపురం రోడ్డు, భగవతి కాటా వద్ద, షేక్ ఆసిఫ్ నూతన వైసిపి పశ్చిమ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిపై చర్చకు చంద్రబాబుతో తాను సిద్ధమని అన్నారు. సిఎం జగన్ పేద, మధ్య తరగతి ప్రజల కోసం కష్టపడుతుంటే రియల్ ఎస్టేట్ కోసం రైతులను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. సుమారు 1300 కోట్లు నిధులతో నియోజకవర్గ అభివృద్ధిని చేసి, పార్టీని నమ్ముకున్న వారికి రాష్ట్రంలోనే ఎక్కువ పదవులు తెచ్చిన నియోజకవర్గం ఇదే అన్నారు. జగన్ నాయకత్వంలో సంక్షేమం, అభివద్ధి రెండు ఒకదాని వెనుక ఒకటి పరుగులు తీసాయని ఆసిఫ్ అన్నారు. అనంతరం రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా, పశ్చిమ నియోజకవర్గంలో ఆసిఫ్‌ని భారీ మెజార్టీతో గెలిపిస్తామని అసోసియేషన్ సభ్యులు సురేష్ కిషోర్ అన్నారు. ఈ ఆత్మీయ సమావేశంలో పశ్చిమ నియోజకవర్గం పరిశీలకులు గుబ్బ చంద్రశేఖర్, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, కార్పొరేటర్లు రత్నకుమారి, చైతన్య రెడ్డి, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఊబకాయంపై అవగాహన అవసరం

రమేష్ హాస్పిటల్ వైద్యులు డాక్టరు రాకేష్ బొబ్బా - నేడు ప్రపంచ ఊబకాయ దినోత్సవం



ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఊబకాయం వల్ల కలిగే ప్రమాదాల గురించి సాధారణ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం మార్చి 4న ప్రపంచ ఊబకాయ దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు రమేష్ హాస్పిటల్స్ ప్రముఖ హార్మోన్లు, గ్రంధుల సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులు డాక్టర్. బొబ్బా రాకేష్ తెలియ చేసారు. ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్ ఊబకాయం గురించి ప్రజాశక్తికి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 100 కోట్ల మంది ప్రజలు ఊబకాయంతో బాధపడుతున్నారని వారిలో 13.5 కోట్ల మంది ఊబకాయులతో ప్రపంచంలో అత్యంత ఊబకాయం కలిగిన దేశాల్లో భారతదేశం 3వ స్థానంలో ఉందని వివరించారు. ఊబకాయం అనేది ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యరంగానికి ఒక సవాలు వంటిదని ప్రపంచవ్యాప్తంగా సంభవించే మరణాలలో 5 శాతం మరణాలు ఊబకాయం వల్లనే జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహమ్మారిని ఎదుర్కోవడానికి 'లెట్స్ టాక్ అబౌట్ ఒబేసిటీ' అనే నినాదంతో ప్రజలలో అవగాహన కలిగించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన పిలుపు మేరకు ప్రజలకు ఊబకాయంపై అవగాహన కలిగిస్తున్నామని డాక్టర్.రాకేష్ తెలియ చేశారు. భారత దేశంలో సుమారు 1.5 కోట్ల మంది చిన్నారులు ఊబకాయంతో బాధపడుతున్నారు. ఎక్కువగా ఫాస్ట్ ఫుడ్స్ తినడం, శారీరక వ్యాయామం లేకపోవడం, తగినంత నిద్ర లేకపోవడం, టెలివిజన్, మొబైల్ ఫోన్లు ఎక్కువగా వినియోగించటం వంటివి చిన్నపిల్లలలో ఊబకాయానికి ప్రధాన కారణాలు. ఊబకాయం అనేది మధుమేహం, అధిక రక్తపోటు, గుండె పోటు, పక్షవాతం, వంధ్యత్వం వంటివే కాకుండా రొమ్ము, పెద్దప్రేగు, కాలేయం వంటి అనేక రకాల క్యాన్సర్‌లకు ప్రధాన కారకంగా ఉంది. ఊబకాయం అనేది పలు రకాల హార్మోన్ సమస్యల వలన కూడా వచ్చే అవకాశం ఉంది.

చిన్నపిల్లలు ఊబకాయం బారిన పడకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

తల్లిదండ్రులు పిల్లలకు చిన్న వయసు నుంచి ఆరోగ్యమైన ఆహారాన్ని అలవాటు చేయడం. పాలు, ఆకుకూరలు, వీటితో పాటు ప్రొటీన్ సమద్ధిగా ఉండే ఆహారాన్ని అందించడం. రోజుకి కనీసం ఒక గంట శారీరక వ్యాయామం ఉండేలా చూడటం. చిన్నపిల్లలను టెలివిజన్,ఫోన్లకు దూరంగా ఉంచటం తద్వారా వారికి తగినంత నిద్ర చేకూరుతుంది. పిల్లలలో ఎవరైతే అధిక బరువుతో బాధపడుతున్నారో వాళ్లకి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించటం ద్వారా ఊబకాయం బారిన పడకుండా కాపాడవచ్చు. వీటితో పాటుగా తల్లిదండ్రులు కూడా తమ వంతుగా పిల్లలతో పాటు మంచి ఆహారాన్ని తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, పిల్లలు ఉన్నప్పుడు టెలివిజన్, ఫోన్లు ఎక్కువగా చూడకుండా ఉండటం తప్పనిసరి అని రమేష్ హాస్పిటల్స్ ప్రముఖ ఎండో క్రైనాలజిస్ట్ డాక్టర్. బొబ్బా రాకేష్ తెలిపారు.

రైతుల ఆరోగ్యమే లక్ష్యంగా ఉచిత వైద్యం: చైర్మన్ వరుణ్



మాట్లాడుతున్న వరుణ్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఆరోగ్య పరిరక్షణపై రైతుల్లో అవగాహన కల్పించడంతో పాటు వారికి గుండె సంబంధ వైద్య సేవలను అందించేందుకు వరుణ్ కార్డియాక్ సైన్సెస్ ముందుకు వచ్చిందని, పాడి రైతులకు ఉచిత వైద్య సేవలను అందించనున్నట్లు హాస్పటల్ చైర్మన్ డాక్టర్ గుంటూరు వరుణ్ తెలిపారు. బెంజిసర్కిల్ వద్ద గల డాక్టర్ వరుణ్ కార్డియాక్ సెంటర్ నందు ఆదివారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా డాక్టర్ వరుణ్ మాట్లాడుతూ రాధాలక్ష్మీ హార్ట్ ఫౌండేషన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాక్ సర్జన్స్ అసోసియేషన్ సహకారంతో గత ఏడాది ఆగస్టు నుండి ఈ ఏడాది జనవరి వరకు మొదటి విడతగా సుమారు 1700 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.8వేలు విలువ చేసే గుండె, లివర్, కిడ్నీ, దంత సంబంధ వైద్య సేవలను అందించినట్లు తెలిపారు. వీరిలో 940 మందికి గుండె సంబంధ సమస్యలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. వారందరికీ ప్రస్తుతం యాంజియో పరీక్షలు నిర్వహిస్తున్నామని ఇప్పటి వరకు 220 మందికి యాంజియోలు పూర్తయ్యాయని తెలిపారు. యాంజియో పరీక్షల అనంతరం అవసరమైన వారికి స్టంట్లు, శస్త్ర చికిత్సలు పూర్తి ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. వీటి విలువ మొత్తం రూ.4 కోట్ల వరకు ఉంటుందని తెలిపారు. ఇందులో ఒక ట్రాన్స్ కేథటర్ అవోటిక్ వాల్వ్ ఇంప్లాంటేషన్ ఒకొక్కరికి రు. 23 లక్షల ఖర్చవుతుందని అన్నారు. తానా మాజీ అధ్యక్షులు లావు అంజయ్య చౌదరి మాట్లాడుతూ పూర్తి సేవా భావంతో డాక్టర్ వరుణ్ చేస్తున్న వైద్య సేవలకు తాము కూడా ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు డాక్టర్ వరుణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో తానా కృష్ణాజిల్లా ఫోరం అధ్యక్షులు రామ్ పోతినేని, కృష్ణా మిల్క్ యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు, రాధా లక్ష్మీ హార్ట్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ గుంటూరు రాజ్యలక్ష్మీ , ట్రస్టు సభ్యులు ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్, కిలారు బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంచల్ యూనివర్సిటీలో పోటీ పరీక్షలకు శిక్షణ



మాట్లాడుతున్న సర్వేశ్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యార్థులకు థియరీతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్, పోటీపరీక్షలకు కూడా శిక్షణ ఇస్తున్నట్లు సర్వేశ్ నేషనల్ అండ్ ఇంటర్నేషనల్ అడ్మిషన్ డైరెక్టర్ సర్వేశ్ తెలిపారు. నగరంలోని హోటల్ ఫార్చ్యూన్ మురళీ పార్క్ నందు ఉత్తరాంచల్ యూనివర్సిటీ బ్రోచేర్ లాంచింగ్ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సర్వేశ్ రస్తోగి నేషనల్ అండ్ ఇంటర్నేషనల్ అడ్మిషన్ డైరెక్టర్ ఉత్తరాంచల్ యూనివర్సిటీ బ్రోచర్ ను అవిష్క రించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూమా యూనివర్సిటీ కి నాక్ ఎప్లస్ గ్రేడ్ ఉందన్నారు. గత ఐదు సంవత్సరాలుగా యూనివర్సిటీ కొత్త కోర్సులు పెట్టినట్లు తెలిపారు. ఉత్తరాంచల్ యూనివర్సిటీలో స్టూడెంట్‌కి థియరీ కన్నా ప్రాక్టికల్ నాలెడ్జి ఎక్కువ ఉండేలా ఉంటాయన్నారు. ఇక్కడ స్టూడెంట్ కోర్స్ కంప్లీట్ అయిన తర్వాత ప్లేసెమెంట్ రావడానికి ఈజీగా ఉంటుందని ఇతర యూనివర్సిటీలో కన్నా ఇక్కడ ఫీజు, స్టడీస్, సదుపాయాలు అందరికీ అందుబాటులో ఉంటాయన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి మొత్తం 7 అడ్మిషన్స్ సెంటర్స్ ఉన్నాయని, విజయవాడ, గుంటూరు, కర్నూలు, వైజాగ్, తిరుపతిలో సెంటర్లు ఉన్నాయన్నారు. ఉత్తరాంచల్ యూనివర్సిటీలో చదివిన వారికి 98 శాతం ప్లేస్ మెంట్ సాధించామని అన్నారు ..ఉత్తరాంచల్ యూనివర్సిటీ 100 ఎకరాలలో ఉందని హాస్టల్ సదుపాయం ఉందన్నారు.సౌత్ ఇండియన్ స్టూడెంట్స్ కు ప్రత్యేకంగా మెస్ సదుపాయం ఉందన్నారు. ఫీ స్ట్రక్చర్ కూడా ఇతర యూనివర్సిటీల కన్నా తక్కువ ఉంటుందని మెరిట్ స్కాలర్షిప్ కూడా యూనివర్సిటీ అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకష్ణారెడ్డి అడ్మిషన్ పార్ట్నర్ సౌత్ ఇండియా,ఇంతియాజ్ సౌత్ ఇండియా అడ్మిషన్స్ డైరెక్టర్ స్వర్ణ శర్మ హెడ్ ఆఫ్ ద ఎరోస్పేస్ బ్రహ్మ రెడ్డి అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఉపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పేద విద్యార్థినులకు ఆదివారం న్యూ జనరేషన్ యూనిటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పలు ఉపకరణాలు అందజేశారు. న్యూ జనరేషన్ యూనిటీ ఆర్గనైజేషన్ కార్యాలయంలో నిర్వాహకులు కిరణ్ సతీమణి లక్ష్మీ కుటుంబ సమేతంగా వేదాన్స్ మొదటి పుట్టినరోజు వేడుక, మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. విద్యార్థినులకు ఆహార పొట్లాలు, పరీక్ష అట్టలు, పెన్నులు, ఎగ్జామ్ కిట్స్, నూతన వస్త్రాలు అందించారు. అనంతరం సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి సాయి వినయ్ కుమార్ మాట్లాడుతూ మహిళలు ఎన్నో లక్ష్యాలు సాధిస్తున్నారని వారు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. సంస్థలోని విద్యార్థినులు కూడా ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజ్వల ఓపెన్ చిల్డ్రన్ మల్లేశ్వరి, వైఆర్జి చైల్డ్ కేర్ ఫెసిలిటేటర్ నాగూర్ బి, హెల్త్ సర్వీస్ రసీదా, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో విజయవాడ

మార్పుకోసం ప్రచారంలో సిహెచ్.బాబూరావు



ఇంటింటి ప్రచారంలో బాబూరావు

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : అభివృద్ధికి ఆమడదూరంలో నగరం ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. మార్పుకోసం సెంట్రల్ సిటీ 62వ డివిజన్‌లో ఆదివారం ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. బాబూరావు మాట్లాడుతూ విజయవాడ నగర అభివృద్ధి కమ్యూనిస్టుల హయాంలో జరిగింది తప్ప ప్రస్తుతం జరగలేదన్నారు. భూకబ్జాలు, మద్యం దుకాణాలు నిర్వహించే వారిని గద్దె దించాలని అన్నారు. వచ్చిన నిధులను కూడా సక్రమంగా వినియోగించుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని సింగ్‌నగర్ ఫ్లైఓవర్ బుడమేరు రెండో వంతెన, మాకినేని బసవపున్నయ్య స్టేడియం వి.హెచ్.ఆర్ కాంప్లెక్స్, ఎన్టీఆర్ కాంప్లెక్స్, ఇందిరా గాంధీ స్టేడియం కాంప్లెక్స్ వంటి నిర్మాణాలు చేపట్టిందన్నారు. కమ్యూనిస్టుల హయాంలోనే గుణదల ఫ్లైఓవర్ నిర్మాణం ప్రారంభించి 15 సంవత్సరాలైనా పూర్తి చేయలేని పాలకులు మనకు అవసరమా అని ధ్వజమెత్తారు. నగరాభివృద్ధి జరగాలంటే కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపించాలని సిపిఎంకు మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.రమణారావు, కె.దుర్గారావు, ఎన్.నాగేశ్వరరావు సిపిఐ నాయకులు ఎల్.శివ, భారతి తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ఓటమే ధ్యేయంగా పని చేయాలి

• సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న వై.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-గన్నవరం : బీజేపీ దాని మద్దతు పార్టీల ఓటమే ధ్యేయంగా పని చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం గన్నవరంలోని అట్లూరి శ్రీమన్నారాయణ మీటింగ్ హాలులో రానున్న ఎన్నికల్లో పోటీ చేయడానికి నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. సిపిఎం నాయకులు కళ్ళం వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో ఎన్నికల హడావిడి మొదలైందన్నారు. బీజేపీ మరోసారి 370 సీట్లతో అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నాయకులు చెబుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. రూపాయి మార్కెట్ విలువ ఎందుకు పడిపోయిందో బీజేపీ నేతలు చెప్పాలన్నారు. 2014 సంవత్సరంలో డాలర్ విలువ 58 రూపాయలు ఉండగా.. ఇప్పుడు 83 రూపాయల అయ్యింద న్నారు. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేల యిందన్నారు. దేశాన్ని అప్పుల్లో, ఆర్థికంగా కుంగదీసిన ఘనత మోదీకే దక్కిందన్నారు. గతంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.450 ఉన్నప్పుడు న్నప్పుడు బీజేపీ నేతలు ఢిల్లీలో రోడ్డెక్కి పెద్ద ఆందోళన చేశారన్నారు. ఇప్పుడు గ్యాస్ సిలిండర్ ధర 1,150 రూపాయ లైనప్పుడు ఎర్రజెండా పార్టీలు ధర్నాలు చేస్తే రూ.912 చేశారన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల 120 నిత్యావసర వస్తువుల ధరలు పరోక్షంగా పెరిగాయని విమర్శించారు. 2014 సంవత్సరానికి ముందు బీజేపీ తాము అధికారంలోకి రాగానే రెండు కోట్ల ఉద్యోగాలు, ప్రతి ఇంటికి రూ.15 లక్షలు అందిస్తామని ప్రకటించిందన్నారు. తీరా అధికారంలోకి రాగానే అవన్నీ మరిచిపోయిందని తెలిపారు. తాజాగా రాముని పేరు చెప్పి అయోధ్య నిర్మించామని రాజకీయం చేయడం సరికాదన్నారు. కమ్యూనిస్టులకు అన్ని మతాలు సమానమేనని అని వెల్లడించారు. మరోసారి మోడీ అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యం బతికి బట్టకట్ట లేదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ రాష్ట్రంలో సిపిఎం పోటీ చేసే స్థానాల్లో గన్నవరం కూడా ఒకటి అన్నారు. ఈ నియోజకవర్గంలో పార్టీ ప్రజల పక్షాన అనేక ఏళ్లుగా పోరాటాలు చేసిందనీ ఇంకా చేస్తూనే ఉందని తెలిపారు. అంగన్వాడీలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లు పోరాటాలే దానికి నిదర్శనం అన్నారు. సేవా కార్యక్రమాల ముసుగులో ఓట్ల రాజకీయం చేస్తున్న పార్టీలకు తగిన గుణ పాఠం చెప్పాలన్నారు. గన్నవరం నియోజకవర్గంలో ఓట్లు వివరాల పరిశీలనలోకి పెడితే.. గన్నవరం మండలంలో 74,134, ఉంగుటూరు మండలంలో 44,085, బాపులపాడు మండలంలో 70,228, విజయవాడ రూరల్ మండలంలో 88,126కోట్లు ఉన్నాయని తెలిపారు. ఈ రోజు నుంచి 40 రోజులపాటు ఎన్నికలే లక్ష్యంగా పని చేయమన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు ఆర్. రఘు, ఎం. హరిబాబు, టివి లక్ష్మణ స్వామి, జ్యోతి, బేత శ్రీనివాసరావు, మల్లంపల్లి ఆంజనేయులు, అజ్మీర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతన్న కొసరాజు సాయిరాం

బచ్చుల అర్జునుడు సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-గన్నవరం : దివంగత బచ్చుల అర్జునుడు ప్రథమ వర్ధంతి సందర్భంగా ముస్తాబాద గ్రామంలో ఆదివారం తెలుగుయువత ఆద్వర్యంలో ఆయన చిత్ర పటానికి పాలాభిషేకం చేసి, పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కొసరాజు సాయిరాం మాట్లాడుతూ బచ్చుల అర్జునుడు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి క్రమశిక్షణ గల కార్యకర్తగా పార్టీకి ఎనలేని సేవలందించారని, కష్ట నష్టాలలో పార్టీకి అండగా నిలుస్తూ చెరగని ముద్ర వేసారని అన్నారు. పార్టీ కష్టాలలో ఉన్నప్పుడు గన్నవరం నియోజకవర్గ ఇంచార్జిగా ఆయన పార్టీకి చేసిన సేవలు చిరస్మం ీయంగా నిలిచిపోతాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ తెలుగుమహిళా అధ్యక్షురాలు మేడేపల్లి రమ, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు పరుచూరి నరేష్, పరిటాల జోగేంద్ర, అడుసుమిల్లి నవీన్, ముస్తాబాద గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి మేడేపల్లి కాంతారావు, కడియాల కోటయ్య, గరిమెళ్ళ అర్జునరావు, పాటిబండ్ల కిరణ్ పాల్గొన్నారు.



ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉపకార వేతనాల పంపిణీ

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక జగన్నాధపురంలోని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని కమ్మవారి సత్రంలో పేద విద్యార్థి, విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా వైసిపి రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ పాల్గొని 16 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి పదివేల చొప్పున లక్ష అరవై వేల నగదును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహనీయులు భవిష్యత్తు తరాలకు మేలు చేయాలనే మంచి ఆశయంతో దశాబ్దాల క్రితమే ధార్మిక సంస్థలు నెలకొల్పారన్నారు. తరాలు మారిన నేటికీ ధార్మిక సంస్థల సేవలు కొనసాగుతున్నాయని, సంస్థల సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారులు గంగు శిరీష, పర్వతనేని ఆనంద్, ఎంపిపి గద్దె పుష్పరాణి, బొప్పన రమేష్, వడ్లమూడి నరసింహారావు, మోటూరి శివరామకష్ణ, పాలడుగు రాంప్రసాద్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ముందు సర్పంచ్‌ల ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న వైవీబీ రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచ్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం మచిలీపట్నం జిల్లాకలెక్టరేట్ ముందు సర్పంచ్లు, ఎంపీటీసీలు ధర్నా నిర్వహిస్తున్నట్లు చాంబర్ అధ్య క్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశ ంలో మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్య సాధనే లక్ష్యంగా 73, 74 రాజ్యా ంగ సవరణలోని ఆర్టికల్ 243జి 11 షెడ్యూల్లో పేర్కొన్న 29 అంశాలలో నిధులు, విధులు, అధికారాలు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులైన సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్మన్లకు బదలాయించి గ్రామపంచాయతీ, మండల పరిషత్, జిల్లాపరిషత్లను బలోపేతం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సర్పంచుల ధర్నాలో జిల్లాలో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. సర్పంచుల సంఘం ఉమ్మడి కష్ణాజిల్లా అధ్యక్షుడు గోలి వసంతకుమార్, మద్రివాడ సర్పంచ్ వంపుగడల ఫ్రాన్సిస్, పాల్గొన్నారు.

గుడివాడలో 'బాబు ష్యూరిటీ'



ప్రజాశక్తి - గుడివాడ : పట్టణంలోని 30వ వార్డు ధనియాలపేటలో ఆదివారం బాబు ష్యూరిటి భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం టిడిపి ఇన్‌చార్జి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్‌లు నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పట్టణ టిడిపీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, జనసేన అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.



స్కూల్ యాజమాన్యాన్ని సన్మానిస్తున్న దృశ్యం

'కొమ్మారెడ్డి' స్కూల్లో ఫేర్‌వెల్ వేడుకలు

ప్రజాశక్తి-బంటుమిల్లి : మండలంలోని కొమ్మారెడ్డి హైస్కూల్‌లో ఆదివారం 10 వ తరగతి విద్యార్థులు ఘనంగా ఫేర్ వెల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, సెక్రటరి అండ్ కరస్పాండెంట్ కె.యస్.వి.జి శోభ, డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య, ఆయన సతిమణి హరిణి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా విద్యార్థిని, విద్యార్థులు పాఠశాలతో అనుబంధాన్ని అనుభవాలను పంచు కున్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ నాగేశ్వరరావు విద్యార్థులు తమ జీవితాన్ని ఎంత అందంగా మలచుకోవాలో వివరించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ మాట్లాడుతూ 10వతరగతి అనంతరం విద్యార్థులు ఏర్పరుచుకోవలసిన ప్రణాళికలు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థినీల సాంస్కృతిక కార్యక్రమాలు

చనిపోయిన వారికీ ఓట్లు

• ఓటర్ల జాబితా తప్పులతడకగా

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గ ఓటర్ల జాబితాలో అనేక తప్పులు చోటుచేసుకున్నాయి. పేర్లు ఫోటోలు తప్పులు పడడంతో పాటు చనిపోయిన వారికీ ఓట్లు ఉండడం గమనార్హం. గన్నవరం నియోజక వర్గంలోని 4 మండలాల్లో రెండు లక్షల 79 వేల కోట్లు ఉన్నాయి. విజయవాడ రూరల్ మండలంలో 88 వేల ఓట్లు ఉన్నట్టుగా అధికారులు చూపించారు. అయితే రామవరప్పాడు పంచాయతీలోని గతంలో కంటే పదివేల ఓట్లు ఎక్కువగా ఉన్నట్లుగా చూపిస్తున్నారు. ఒక పంచాయతీలో ఇన్ని వేల ఓట్లు ఎలా వచ్చాయనేది అధికారులకే తెలియాలి. దొంగ ఓట్లు ఎక్కువగా నమోదు చేశారని స్థానికులు అంటున్నారు. ఇక చనిపోయిన వారి పేర్లతో ఓట్లు గ్రామాల వారీగా అధిక సంఖ్యలో ఉన్నాయి. దీనికి ఉదాహరణ ముస్తాబాద్ గ్రామ పంచాయతీలో కొన్ని పేర్లు ఉన్నాయి. బోడపాటి అంజయ్య తండ్రి వెంకటరత్నం, వేము కోటేశ్వరరావు తండ్రి జాన్ సుబ్బారావు, వేము కోటేశ్వరమ్మ భర్త రాములు, బి ఎలికమ్మ భర్త భూషణంలు ఎప్పుడో చనిపోయారు కానీ వారి పేర్లతో ఓట్లు ఉన్నాయి. ఈ ఊరిలోనే కాదు గన్నవరం, కేసరపల్లి, దావాజీ గూడెం, తెంపల్లె, సూరంపల్లి ఇలా అనేక గ్రామాల్లోని ఓటర్ల జాబితాలో దొంగ ఓట్ల తో పాటు,చనిపోయిన వారి ఓట్లు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. అదేవిధంగా పేరు ఒకటి ఫోటో మరొకటి ఉన్న పరిస్థితి కూడా లేకపోలేదు. విజయవాడ రూరల్ మండలంలో ఎక్కువగా దొంగ ఓట్లు ఉన్నాయని వాటిని పరిశీలించి తొలగించాలని రాజకీయ ప్రముఖులు కోరుతున్నారు. గ్రామస్థాయిలో బూత్ లెవెల్ అధికారులు సక్రమంగా పనిచేయడం లేదని విమర్శ ఉంది. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు రంగంలోకి దిగి ఓటర్ల జాబితాను సరి చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీలు కోరుతున్నారు.


356 UOG1686278
పేరు : అంజయ్య బోడపాటి
తండ్రి పేరు: వెంకటరత్నం
ఇంటి సంఖ్య : 3-171/1
వయస్సు : 54 లింగం : పురుషులు

535 UOG1684687
పేరు : కోటేశ్వరరావు వేము
తండ్రి పేరు: జాన్ సుబ్బారావ
ఇంటి సంఖ్య : 3-65-1
వయస్సు : 60 లింగం : పురుషులు

509 UOG1684570
పేరు : కోటేశ్వరమ్మ వేము
భర్త పేరు: రాములు
ఇంటి సంఖ్య : 3-57
వయస్సు : 72 లింగం : స్త్రీలు

చనిపోయిన వారి పేరుతో ఉన్న ఓట్లు

నేడు కలెక్టరేట్లో ఒదన

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో సోమవారం ఉదయం పది గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 9.45 గంటలకు స్పందన కార్యక్రమానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

మొదటిపేజీ తరువాయి

మళ్లీ టెండర్లు !

కూడా రానివారు మరికొందరు ఉన్నారని తెలిపారు. కొంతమందికి నగర శివారు ప్రాంతంలో స్థలాలు కేటాయించి నగరం నుండి తరిమేస్తున్నారని, అందుకే సింగ్‌నగర్లోని డిస్నీల్యాండ్‌లో 57 ఎకరాల స్థలాన్ని పేదలకు ప్లాట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు డి.కాశీనాథ్, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణరావు, అధ్యక్షులు కె.దుర్గారావు, 57వ డివిజన్ సిపిఎం నాయకులు టి.శ్రీనివాస్ సాయి. సిఐటియు నాయకులు రాము, రాజులమ్మ, ఎన్వి రమణ, ఆదిలక్ష్మి, సన్యాసమ్మ, నాగలక్ష్మి, మేరి, నాగరాజు, డి.రమణ, పి.ప్రసాద్, మల్లిక పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం

సత్ఫలితాలు ఇస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం పోలియో కేసులు నమోదు కానప్పటికీ చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం కొనసాగించి పోలియో బారిన పడకుండా రక్షించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఐదు సంవత్సరాల వయస్సులోపు ఉన్న 2.48 లక్షల మంది చిన్నారులకు 1,008 పల్స్ పోలియో కేంద్రాల ద్వారా పోలియో చుక్కలు వేస్తున్నామన్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో 35 కేంద్రాలతో పాటు 71 మొబైల్ వాహనాల ద్వారా చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు 4,244 మంది వ్యాక్సినేటర్లను నియమించడం జరిగిందన్నారు. 3, 4 తేదీలు సోమ, మంగళవారాల్లో ప్రతి ఇంటిని పల్స్ పోలియో బృందం సందర్శిస్తుందన్నారు. ఏ కారణం చేతనైనా పోలియో చుక్కలు వేయించని పిల్లలకు పోలియో చుక్కలు వేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో సుమారు 6.50 లక్షల గృహాలను పోలియో బందాలు సందర్శిస్తాయన్నారు. ఇందుకు గ్రామీణ ప్రాంతంలో 1222, పట్టణ ప్రాంతంలో 794 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. తద్వారా నూరు శాతం చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసి లక్ష్యాన్ని సాధించడానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఎం.సుహాసిని, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత, టిబి కంట్రోల్ అధికారిణి ఉషారాణి, డిప్యూటీ డియంహెచ్‌వో ఇందుమతి, సిఎంహెచ్ఓ డాక్టర్ రత్నావళి తదితరులు పాల్గొన్నారు.

వేసవి వ్యాధులపై అప్రమత్తత అవసరం

సిహెచ్‌సిలు, 357 ఉప ఆరోగ్యకేంద్రాల్లో వడదెబ్బ, వేసవిలో వచ్చే వ్యాధుల చికిత్సకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి. వేసవి వ్యాధులపట్ల ప్రజలకు ఎఎన్ఎంల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న : పల్స్‌పోలియో ఏర్పాట్లు పూర్తయ్యాయా?

ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాం. మూడు రోజుల పాటు పోలియో వ్యాక్సిన్ పిల్లలకు అందిస్తాం. మొదటి రోజు బూత్‌ల వద్ద, రెండు మూడు రోజుల్లో ఇళ్ల వద్దకు వెళ్లి పల్స్‌పోలియో చుక్కలు వేస్తాం. దీనిపై సిబ్బందికి శిక్షణ పూర్తి చేశాం. పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలతోపాటు అన్ని కేంద్రాలకు వ్యాక్సిన్ పంపించాం.జిల్లాలో ఐదు సంవత్సరాలలోపు ఉన్న 1, 44, 600 మంది పిల్లలకు పల్స్ పోలియో వేస్తాం. రోజుకు సగటున జిల్లాలో 70 మంది పుడుతున్నారు. అప్పుడే పుట్టిన పిల్లల మొదటి పల్స్‌పోలియో వేస్తాం.

ప్రశ్న : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారా?

ఫ్యామిలీ డాక్టర్‌తో పాటుగా రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నాం. స్పెషలిస్టు డాక్టర్ల సేవలను గ్రామాల్లోకి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వెళుతున్నాం. జనవరి రెండో తేదీన మొదలైన ఈ కార్యక్రమం జూన్ 28వ తేదీకి పూర్తయ్యే విధంగా జిల్లాలో షెడ్యూల్ వేశాం. మార్చి ఒకటో తేదీనాటికి జిల్లాలోని రూరల్‌ప్రాంతాల్లో 187, అర్బన్‌లో 49 శిబిరాలు నిర్వహించాం. 1 లక్ష 20 వేల మంది పేషెంట్లను నిపుణులైన వైద్యులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోనే అత్యధిక సగటు ఓపి జిల్లాలో 488 ఉంది.

కలిసి పని చేద్దాం

బొమ్మసానితో దేవినేని ఉమా సంప్రదింపులు



గొల్లపూడిలో బొమ్మసానిని కలిసిన దేవినేని ఉమా

ప్రజాశక్తి-మైలవరం

మైలవరం వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఈ నెల రెండో తేదీన హైదరాబాదులో టిడిపి అధినేత చంద్రబాబునాయుడుని కలిసి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. దీంతో మైలవరం నియోజకవర్గం టిడిపిలో రాజకీయం ఒక్కసారిగా హీటెక్కింది. నిన్న, మొన్నటి వరకు వసంత రాకను వ్యతిరేకించిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, గొల్లపూడికి చెందిన మరో నేత బొమ్మసాని సుబ్బారావుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. అలాంటిది దేవినేని ఉమా ఆదివారం గొల్లపూడిలోని బొమ్మసాని గృహానికి వెళ్లి సంప్రదింపులు జరిపారు. వసంత కృష్ణప్రసాద్‌కు సహకరించేది లేదని, టిడిపి అధిష్టానం ఇద్దరిలో ఎవరికి సీటు ఇచ్చిన ఒకరికి ఒకరు సహకరించుకోవాలని, ఇద్దరూ ఒక నిర్ణయానికి వచ్చి కలిసి పని చేస్తామని బహిరంగంగా ప్రకటన చేశారు. దీంతో మైలవరం సీటు తనదేనని టిడిపి తరఫున మైలవరం నుంచి సునాయసంగా గెలవచ్చనుకున్న వసంత పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారైంది. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో గత ఏడాది నుండి మైలవరం టిడిపి తరపున సీటు తనదంటే తనదేనని మాజీ మంత్రి దేవినేని, బొమ్మసాని సుబ్బారావు, మరో నేత కాజా రాజ్‌కుమార్ పోటీపడ్డారు. మరో 40 రోజుల్లో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో వీళ్లవరినీ కాదని వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు టిడిపి నుండి మైలవరం సీటు కేటాయిస్తున్నట్లు ప్రచారం సాగింది. మాజీ మంత్రి దేవినేనితో పాటు బొమ్మసాని తదితరులు వసంత రాకను మొదటినుండి తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చారు. మరో ప్రత్యామ్నాయం చూసుకోవాలని ప్రెస్‌మీట్లు పెట్టి చెప్పారు. వీరెవరిని ఖాతరు చేయకుండా వసంత టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. మొన్నటి వరకు తమ నెత్తిపై స్వారీ చేసిన వసంత టిడిపి చేరి టికెట్ తనదేనంటే ఎలా సహకరిస్తామని టిడిపి క్యాడర్ కూడా బహిరంగంగానే తేల్చి చెబుతున్నారు. మైలవరం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కోసం పోటీపడి బద్ధ విరోధులుగా ఉన్న దేవినేని ఉమా, బొమ్మసాని సుబ్బారావులు ఏకతాటి పైకి వచ్చి మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా వసంతకు సహకరించేది లేదని తేల్చి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నారా లోకేష్ ఇచ్చిన పిలుపుమేరకు ఈ నెల 4వ తేదీన విజయవాడ రూరల్ మండలంలో శంఖారావం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వైసిపి తరఫున మైలవరం నియోజకవర్గ నుండి ఇన్చార్జిగా ఉన్న జడ్పిటిసి తిరుపతిరావుపై సునాయాసంగా విజయం సాధించవచ్చుని ధీమాతో ఉన్న వసంతకు వారిద్దరి నిర్ణయంతో షాక్ అయ్యారని సమాచారం. వసంత తండ్రి మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరరావు సైతం ఇటీవల బొమ్మసాని సుబ్బారావుతో మాట్లాడారు. టిడిపి తరపున అవకాశం లేదని మరో ప్రత్యామ్నాయం చూసుకోవాలని తేల్చి చెప్పారు. దేవినేని ఉమా, బొమ్మసాని, కాజా రాజ్‌కుమార్లను కాదని వసంతకు మైలవరం సీటు కేటాయించిన టిడిపి అధిష్టానం తన నిర్ణయాన్ని పునరాలోచన చేస్తుందో లేదో చూడాలి.

గరిటలు మోగిస్తూ..బూరలు ఊదుతూ రాజధాని రైతుల నిరసన



ప్రజాశక్తి – తుళ్లూరు

అమరావతి రాజధానిని 6 నెలల్లో అభివృద్ధి చేయాలని, రైతుల ప్లాట్లను అభివృద్ధి చేయాలని హైకోర్టు తీర్పునిచ్చి ఆదివారంతో రెండేళ్ల పూర్తయ్యాయి. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకొని రైతులు ప్రభుత్వానికి నిరసన తెలిపారు. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ మొద్దునిద్ర నటిస్తున్న జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిద్ర లేపుతున్నామంటూ తుళ్లూరు రైతు దీక్షా శిబిరంలో రైతులు, మహిళలు గరిటలు మోగిస్తూ బూరలు ఊదుతూ నిరసన తెలిపారు. నేలపాడు సమీపంలో పిచ్చి చెట్లను నరికారు. ప్రభుత్వం కనీసం జంగిల్ క్లియరెన్స్ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్లాట్లపై రుణం ఇవ్వడానికి ముందుకు రాని బ్యాంకర్లు సచివాలయాన్ని తాకట్టు పెట్టుకొని ప్రభుత్వానికి రుణం ఎలా ఇచ్చిందని రైతులు మండిపడ్డారు. సచివాలయం తాకట్టు వ్యవహారం గురించి పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రైతులు, మహిళలు,రైతు కూలీలు చేస్తున్న దీక్షలు ఆదివారంతో 1538వ రోజుకు చేరాయి. మందడం, వెంకటపాలెం, నెక్కల్లు, తుళ్లూరు, అనంతవరం తదితర గ్రామాల్లో దీక్షలు సాగాయి. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించి జై అమరావతి నినాదాలు చేశారు.

విఐటిలో ఉన్నత విద్యా ప్రణాళిక బోర్డు సమావేశం

ప్రజాశక్తి-తుళ్లూరు

రెండ్రోజుల పాటు నిర్వహించే ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డు 6వ సమావేశం రాజధాని అమరావతిలోని విఐటి విశ్వవిద్యాలయంలో ఆదివారం ప్రారంభమైంది. 'విశ్వవిద్యాలయాల్లో వైబ్రెంట్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను పెంపొందించడం' అంశంపై సమావేశాల్లో చర్చించే ఈ సమావేశాలను ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డ్ ఛైర్మన్, ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డ్ ఆరవ సమావేశానికి రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన 51 మంది వైస్ ఛాన్సలర్లు, డైరెక్టర్లు హాజరయ్యారని తెలిపారు. ఉన్నత విద్య అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డ్ తన సహకారాన్ని అందిస్తుందని తెలిపారు.

ఓటు ద్వారా సమాధానం చెబుతాం

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

పాత పెన్షన్ పునరుద్ధరణ చేస్తారని హామీ ఇచ్చే వారికే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉద్యోగుల మద్దతు ఉంటుందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి.మనోహర్ అన్నారు. విజయవాడలోని యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఓట్ ఫర్ ఒపిఎస్ పేరుతో ముద్రించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. అనంతరం మనోహర్ ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో వామపక్షాలు, సిపిఎం, సిపిఐ పాత పెన్షన్ అమలుకు కట్టుబడి ఉన్నాయన్నారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ కూడా పాత పెన్షన్ పునరుద్ధరణ చేస్తామని చెప్పి హామీ ఇచ్చిందన్నారు. ఇతర రాజకీయ పార్టీలు కూడా పాత పెన్షన్ విషయంలో వారి వైఖరిని స్పష్టం చేస్తూ మేనిఫెస్టోలో అమలు చేస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేస్తామని హామీ ఇచ్చిన వైసిపి సిపిఎస్ రద్దు చేయకుండా జిపిఎస్ పేరిట వేరే స్కీమ్ తీసుకొచ్చి ఉద్యోగులను మోసం చేసిన పరిస్థితి ఉందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య మాట్లాడుతూ 12వ పిఆర్‌సి కమిటీ నివేదిక వచ్చే లోపు ఉద్యోగులకు ఆనవాయితీ ప్రకారం 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత పిఆర్‌సిలో జరిగిన నష్టాన్ని పూరించే విధంగా ఈపిఆర్‌సి సిఫార్సులు ఉండాలని ఆయన కోరారు. అదే విధంగా డిఎస్‌సి 2024లో రాష్ట్రంలో అన్ని ఖాళీలు భర్తీ చేసి మెగా డిఎస్‌సి వేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ డిఎస్‌సి 2024 నుండి అమలు చేస్తున్న అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మళ్లీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కామన్ సర్వీస్ రూల్స్ అమలు చేయుటకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల విషయంలో జిఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ఎం.కృష్ణయ్య, డి.అపర్ణ, గౌరవాధ్యక్షులు మచ్చా శ్రీనివాసరావు, కార్యదర్శులు సూర్యనారాయణ, డి.హరిప్రసాద్, సుధానంద్, పి.భవాని, ఎ.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం

- కృష్ణా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ జి. గీతాబాయి
- పల్స్‌పోలియో విజయవంతం



బందరులో పోలియోచుక్కలు వేస్తున్న డిఎంహెచ్ఒ గీతాబాయి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : పోలియో రహిత జిల్లా లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ జి గీతాబాయి కోరారు. ఆదివారం ఆమె మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలోని భాస్కరపురం 12వ వార్డు సచివాలయంలో పల్స్ పోలియో చుక్కల మందు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కల మందు వేశారు.ఈ సందర్భంగా డిఎంఅండ్ హెచ్ఓ మాట్లాడుతూ కార్యక్రమం తొలి రోజు ఆదివారం జిల్లాలో ఏర్పాటు చేసిన 1,453 బూత్ లలో పోలియో చుక్కల మందు అందిస్తున్నామన్నారు. సోమ, మంగళ వారాల్లో (4, 5 తేదీల్లో) ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటా సర్వే చేపట్టి పోలియో చుక్కలు వేసుకోని వారికి అందిస్తారన్నారు.జిల్లాలో ఉన్న 1.45 లక్షల చిన్నారులకు చుక్కల మందు వేసే లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. అదేవిధంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో సైతం చుక్కల మందు వేసే విధంగా తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 1998 తర్వాత నుంచి దేశంలో ఎక్కడా కూడా ఒక పోలియో కేసు కూడా నమోదు కాలేదని, ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ దేశంతో పాటు జిల్లాను పోలియో రహిత జిల్లా లక్ష్యంగా కషి చేస్తామన్నారు. భావితరాలను అంగవైకల్యం నుండి విముక్తి కలిగించేందుకు తల్లిదండ్రులందరూ బాధ్యతగా వ్యవహరించి తమ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని ఈ సందర్భంగా ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ మాజీ డిప్యూటీ మేయర్ తంటిపూడి కవిత, 12వ డివిజన్ ఇంచార్జి బందెల తామస్ నోబుల్, డాక్టర్ సుష్మ, డాక్టర్ కుమార్ స్వామి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** వైద్య ఆరోగ్యాశాఖ చేపట్టిన పల్స్‌పోలియో చుక్కలు చిన్న పిల్లలందరికి వేయించాలని గన్నవరం జడ్పీటీసి సభ్యురాలు ఎలిజబెత్ రాణి అన్నారు. గన్నవరం ఆర్ టి సి బస్సు స్టాండ్ లో నిర్వహించిన ప్రోగ్రాంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. హెల్త్ సూపర్ వైజర్ యమ్ రేణి రాజ్యం, ఆశ వర్కర్ యమ్ శిరీష తదితరులు పాల్గొన్నారు. అల్లాపురంలో సర్పంచ్ వెంకన్న బాబు, కేసరపల్లిలో సర్పంచ్ లక్ష్మీ మౌనిక, గన్నవరంలో సర్పంచ్ నిడమర్తి సౌజన్య, తెంపల్లి లో శిరీష పోలియో చుక్కలు వేశారు.**ప్రజాశక్తి-గుడివాడ :** సమాజంలో పోలియో శాశ్వత నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రముఖ వైద్యులు మాగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బస్టాండ్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్స్ పోలియో కేంద్రాన్ని వైద్యాధికారి సుదర్శన్‌తో కలిసి మాగంటి శ్రీనివాస్ ప్రారంభించారు. . ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, సచివాలయం సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ మాజీ ప్రతిపక్ష నేత చోరగుడి రవికాంత్ 24వ వార్డులో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ వి.సుధారాణి అంగన్వాడీ టీచర్, ఆశా కార్యకర్త సౌజన్య, మెప్మా ఆర్‌పి శిరీషా, తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** ఉయ్యూరులో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. నగరపంచాయతీ కార్యాలయం వద్ద కమిషనర్ పి వెంకటేశ్వరరావు పిల్లలకు పోలియో చుక్కలువేసి పల్స్ పోలియో ప్రారంభించారు. పట్టణ పరిధిలో పలు చోట్ల ఆరోగ్య శా ఖ ఆధ్వర్యంలో పల్సపోలియో నిర్వహించారు. మండల పరిధి గ్రామాల్లో పల్సిపోలియో కార్యక్రమం నిర్వహించి ఐదు సంవత్సరాల వయస్సులోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** పల్స్ పోలియో మండలంలోని 5 సంవత్సరాలలోపు పిల్లలకు 96 శాతం పోలియో చుక్కలను ఆదివారం అందజేశారు. గుడ్లవల్లేరు పీహెచ్సీ పరిధిలో 18 పోలియో కేంద్రాలు, కవుతరం పి.హెచ్.సి పరిధిలో 19 పోలియోకేంద్రాల ద్వారా పోలియో చుక్కలను పిల్లలకు అందజేశారు. గుడ్లవల్లేరు బస్టాండ్ వద్ద విఆర్ఓ సాయన ప్రకాష్ పోలియో చుక్కలను అందజేశారు. మిగిలిన పిల్లలకు సోమ, మంగళ వారం ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడ్లవల్లేరు మెడికల్ ఆఫీసర్ గోపాల్ నాయక్, కవుతరం పి.హెచ్.సి వైద్యులు డాక్టర్ శ్రావ్య, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-అవనిగడ్డ :** పోలియో వ్యాధి నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పోలియో చుక్క లు వేసే కార్యక్రమం ఆదివారం వేకనూరు పిహెచ్సి పరిధిలోని 33 సెంటర్లలో నిర్వహించారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు వేసే పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, వైసీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావులు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో వైద్యులు సిబ్బంది ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు. అవనిగడ్డ మూడవ వార్డులోని ఎంపీ యూపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఎంపీపీ తుంగల సుమతి దేవి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ కార్యాలయం వద్ద టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మండల వెంకట్రావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బండి రాఘవ రావిరత్నగిరి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పులిగడ్డలోని పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు పులిగడ్డ పిచ్చేశ్వరరావు, గ్రామ ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెదపారుపూడి :** మండల కేంద్ర మైన పెదపారుపూడి పిహెచ్సిలో పల్స్ పోలియో చుక్కలను ఎంపీపీ గోగం సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ 0-5సంవత్సరాలు గల పిల్లలకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సందీప్, దివ్య, కష్ణ, సిహెచ్ఓ కే పద్మలత, పిహెచ్ఎన్ టి ఆర్ రాజేశ్వరిదేవి, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని ఎలమర్రు, చిన్నపారు పూడి, దోసపాడు, మోపరు వెంట్రప్రగడ, గ్రామాల్లో పల్స్ పోరే కార్యక్రమాన్ని నిర్వహించారు **ప్రజాశక్తి మోపిదేవి :** మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 984 మంది పిల్లలకుగాను 949 మందికి (96 శాతం) పోలియో చుక్కలు వేశామని వైద్యాధికారిని హారిక తెలియజేశారు. మోపిదేవి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయానికి వచ్చిన భక్తులు సంబంధించిన చిన్న పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారులు తెలియజేశారు. గ్రామ గ్రామాన సచివాలయాల్లో అంగన్వాడి సెంటర్లలో ఆశ వర్కర్లు, సహాయకులు చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** ఐదు సంవత్సరాలు లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని కృష్ణాపురం గ్రామ సర్పంచ్ వీరంగి బలుసులమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని అయినపూర్, మేడూరు, తాడంకి, వీరంకి లాకు తదితర గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాల సిబ్బంది పోలియోచుక్కలు వేశారు. వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అఖిల, కపిలేశ్వరపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మమతా, డాక్టర్ బాలాజీ, డాక్టర్ సైరాకతూ్తరా, కొత్తూరు సిహెచ్ఓ రమణి, సర్పంచ్ కలపాల రాంబాబు, మండల ఉపాధ్యక్షులు కొడమంచిలి మహేష్, కంభపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



గుడివాడలో...



గుడ్లవల్లేరులో...



మోపిదేవిలో...



పమిడిముక్కలలో..



పెదపారుపూడిలో..



ఉయ్యూరులో...



అవనిగడ్డలో...




గన్నవరంలో...

హరినారాయణ సేవలు నిరుపమానం

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు

ప్రజాశక్తి - విజయవాడ : డాక్టర్ తుమ్మలపల్లి హరినారాయణ సేవలు నిరుపమానమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో తుమ్మలపల్లి హరినారాయణ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే విష్ణు, జస్టిస్ బొప్పాడి కష్ణమోహన్ తో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం తుమ్మలపల్లి అన్నపూర్ణమ్మ విద్యార్థి గహం సంస్థ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులకు స్కాలర్ షిప్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. తుమ్మలపల్లి హరి నారాయణ సేవలను కొనియాడారు. తన యావదాస్థిని సమాజం కోసం ఖర్చుచేసిన మహనీయులు హరినారాయణ అని చెప్పుకొచ్చారు. వేద విద్యను ప్రోత్సహించడం మొదలు కనకదుర్గమ్మ వారి ఫుట్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు, ఆంధ్రా యూనివర్సిటీ అభివద్ధికి నిధులు కేటాయించటం ఇలా అనేక సేవా కార్యక్రమాలు చేశారన్నారు. అటువంటి మహనీయుని విగ్రహాన్ని కళాక్షేత్రంలో ఏర్పాటు చేసుకోవటం సంతోషదాయకమన్నారు. ఇప్పటికి ఆయన ఏర్పాటు చేసిన ట్రస్ట్ పేరిట ఏటా నగరంలో పేద బ్రాహ్మణ విద్యార్థులకు స్కాలర్ షిప్ లు పంపిణీ చేయటం గొప్ప విషయమని మల్లాది విష్ణు అన్నారు. ఇంతటి మహోన్నతమైన వ్యక్తి ఆశయాలు, సిద్ధాంతాలకు ప్రతిఒక్కరూ పున రంకితం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం జస్టిస్ బొప్పాడి కష్ణమోహన్ మాట్లాడుతూ.. హరి నారాయణ గురి ంచి విన్నప్పుడు, ఆయన సేవల గురించి తెలుసుకున్నప్పుడు ఎంతో ఆశ్చర్యం కలిగిందన్నారు. 1944 లోనే విజయవాడ లాంటి నగరానికి టౌన్ హాల్ కావాలని భావించి తన సొంత నిధులను ప్రభుత్వానికి అందజేశారని తెలిపారు. కనుకనే ఆనాడు నగరపాలక సంస్థ నిర్మించిన ఈ భవనానికి తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంగా నామకరణం చేసినట్లు వెల్లడించారు. సమాజానికి మనం చేసే మంచి.. ప్రజలలో మనలను చిరంజీవిగా ఉంచుతుం దనడానికి హరినారాయణ చక్కని ఉదాహరణగా పేర్కొ న్నారు. అటువంటి మహోన్నత వ్యక్తి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో తాను కూడా భాగం కావటం ఆనందంగా ఉందని.. ఆ మహనీయుని స్ఫూర్తితో ప్రతిఒక్కరూ సమాజానికి ఏదోవిధంగా సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రెసిడెంట్ డా.జంధ్యాల శంకర్, ఉపాధ్యక్షులు జి.ఈశ్వర్, కార్యదర్శి జి.వి.ఎస్.ఎస్ .రాఘవరావు, ఉపాధ్యక్షులు ఎం.సత్యనారాయణరావు, కోశాధికారి మోగులూరు శ్రీకష్ణ, కార్యవర్గ సభ్యులు యాబ లూరు లోకనాథశర్మ, బి.వి.ఎస్.చలపతిరావు, కొప్పరపు బలరామకష్ణమూర్తి, కుందా రామనారాయణ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణలో పాల్గొన్న మల్లాది విష్ణు

సోమనాథ్‌కు పిన్నమనేని పురస్కారం



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : డాక్టర్ పిన్నమనేని అండ్ శ్రీమతి సీతాదేవి ఫౌండేషన్ 30వ వార్షిక పురస్కార కార్యక్రమం ఈ నెల 6న జరుగుతుందని ప్రముఖ శాస్త్రవేత్త, భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ చైర్మన్ శ్రీధర్ పానీకర్ సోమనాథ్‌కు అవార్డును అందచేయనున్నామని ట్రస్టు మేనేజింగ్ సభ్యులు డాక్టర్ సి.నాగేశ్వరరావు తెలిపారు. మొగల్‌రాజపురంలోని సిద్దార్ధ ఆడిటోరియంలో ఆదివారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1989లో ఏర్పాటైన తమ ఫౌండేషన్ సామాజిక, కళారంగాలలో విశిష్ట సేవలందించిన వ్యక్తులకు, సంస్థలకు పురస్కారాలను అందిస్తున్నామని తెలిపారు. ఈఏడాది పురస్కారం ప్రముఖ శాస్త్రవేత్త సోమనాథ్‌కు అందిస్తున్నామని తెలిపారు. 38 సంవత్సరాలుగా భారత అంతరిక్ష సాంకేతికాభివృద్ధికి గణణీయమైన కృషి చేశారన్నారు. అంతరిక్ష పరిశోధనకు ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా అస్ట్రానాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా నుండి ప్రతిష్టాత్మకమైన స్పేస్ గోల్డ్ మెడల్ అవార్డును పొందారన్నారు.

ఎన్‌ఎస్‌ఇలో పెరిగిన పెట్టుబడులు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో వినూత్నమైన నమోదిత పెట్టుబడిదారుల సంఖ్య 9 కోట్లను అధిగమించిందని సంస్థ ప్రతినిధి ఎస్.రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌ఎస్‌ఇలో ప్రత్యేక పెట్టుబడిదారుల రిజిస్ట్రేషన్లు గత కొన్ని సంవత్సరాలుగా వేగవంతంగా పెరుగుతున్నాయని తెలిపారు. ఆరు నుండి ఏడు కోట్ల ప్రత్యేక పెట్టుబడిదారులు పెరగడానికి తొమ్మిది నెలల సమయం పట్టిదన్నారు. ఎనిమిది నెలల్లో కోటి పెట్టుబడిదారులు పెరిగారన్నారు. ఈ పెరుగుదల ఐదు నెలల్లోనే సాధించినట్లు తెలిపారు. ఇన్వెస్టర్ బేస్ కూడా గత ఐదేళ్లలో మూడు రెట్లు కంటే ఎక్కువ పెరిగిందని తెలిపారు.

గంపలగూడెం హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గంపలగూడెం: మండలం వ్యాప్తంగా ఉన్న ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష (టాలెంట్ టెస్ట్) స్థానిక విశిష్ట జూనియర్ కళాశాల, జీవి అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించింది. ఈ పరీక్షల్లో మొత్తం 250 మంది పాల్గొనగా, (1,2,3) ముగ్గురిని విజేతలగా ప్రకటించింది. ప్రథమ స్థానం కోట హరిణి, రెండో స్థానం పెద్ద పెద్దగమళ్ళ లిఖిత శ్రీ, మూడో స్థానం కోట ఈశ్వర్ దక్కించుకున్నారు. విజేతలకు యాజమాన్యం 5,3,2 వేల చొప్పున నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలతో పాటు ప్రతిమలను బహుకరించారు. చైర్మన్ వి.గోపీచంద్, డి శ్రీనివాసరావు, కె.సురేష్, పి.హరినాథ్, చెరుకూరి కష్ణారావు, నారెడ్ల కల్పనా రెడ్డిలు అత్త చేసిన వారిలో ఉన్నారు. మండల కేంద్రమైన గంపలగూడెం హై స్కూల్ నుండే ముగ్గురూ విజేతలగా ఎంపిక కావడం విశేషం. ఈ విషయమై పాఠశాల హెచ్‌ఎం.బొల్లె పోగు కిరణ్ కుమార్ జివి అకాడమీ టాలెంట్ ఏర్పాటు పట్ల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ రికార్డు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ అత్యుత్తమ క్లెయిమ్ సెటిల్‌మెంట్ ట్రాక్ రికార్డును సాధించిందని సంస్థ రీజనల్ ప్రతినిధి కె.కుమార్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. 2024 ప్రారంభ ఆర్థిక సంవత్సరంలో తొమ్మిది నెలలకు చెప్పుకోదగిన స్థాయిలో 98.6 శాతం క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్ నిష్పత్తిని సాధించినట్లు తెలిపారు. ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ యొక్క క్లెయిమ్ సెటిల్‌మెంట్ నిష్పత్తి 98.10 శాతం, రెండవ త్రైమాసికంలో 98.14 శాతం త్రైమాసికంలో 98.52 శాతంగా ఉందన్నారు. రానున్న కాలంలో మెరుగైన రేటింగ్ సాధించనున్నట్లు తెలిపారు.

పలుచోట్ల పల్స్ పోలియో

ప్రజాశక్తి - తిరువూరు : పల్స్ పోలియో తిరువూరు మండలంలో 99 శాతం విజయ వంతంగా జరిగినట్లు వైద్యాధికారులు తెలిపారు. చౌటపల్లి, రాజుగూడెం, తిరువూరు పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో 5 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలు 4966 మందికి గానూ 4844 (99 శాతం) మందికి పోలియో చుక్కలు వేసినట్లు చెప్పారు. మొత్తం నాలుగు రూట్లు, ఒక ట్రాన్సిట్, రెండు మొబైల్ టీమ్స్ ద్వారా పల్స్ పోలియోను విజయవంతంగా నిర్వహించినట్లు చౌటపల్లి వైద్యాధికారిణి కె.పూజిత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **అజిత్‌సింగ్‌నగర్ :** విజయవాడ సెంట్రల్ సిటీ ఆదివారం నేషనల్ డే పల్స్ పోలియో కార్యక్రమం రాజీవ్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డే పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక నగర కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య అధికారి రాథోడ్ మాట్లాడుతూ నగరంలో నేషనల్ డే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం స్కూల్ దగ్గర, బస్టాప్‌లలో ప్రజలు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేశామని ఆదివారం బూత్‌ల వారీగా పోలియో చుక్కలు వేస్తున్నారని పేర్కొన్నారు. ఇంకా ఎవరైనా మిగిలితే 4, 5, 6 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఎఎన్‌ఎం ఆశాలు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **విజయవాడ :** విజయవాడ 15 డివిజన్ రామలింగేశ్వర నగర్ పడవల రేవు సెంటర్ 68వ సచివాలయం, 69వ సచివాలయం పరిధి లో సాయిబాల స్కూల్,70వ సచివాలయం పరిధిలో పవన్ వీర అపార్ట్మెంట్,71 సచివాలయం పరిధిలో మాస్టర్ మైండ్ స్కూల్, 72వ సచివాలయంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ళ చల్లారావు ప్రారంభించారు. డిప్యూటీ మేయర్ మాట్లాడారు. **గంపలగూడెం :** గంపలగూడెం, ఊటుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వరసగా, 2545,2106 టార్గెట్ కాగా, 2496,2094 మందికి పోలియో చుక్కలు వేశారు దాదాపు 98 శాతం పూర్తయినట్లు ఆయా ఆసుపత్రుల వైద్య సిబ్బంది పేర్కొన్నారు. **జగ్గయ్యపేట:** మండలంలోని బూచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 6908 మంది పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయాలని లక్ష్యం కాగా 6811 మంది పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. మిగిలిపోయిన పిల్లలకు సోమ, మంగళవారాల్లో పల్స్ పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. పల్స్ పోలియోకు ఐదుగురు సూపర్వైజర్లు, ఒక మొబైల్ టీమ్, ముగ్గురు డాక్టర్లు పర్యవేక్షణలో 190 మంది సిబ్బంది పాల్గొని పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. స్థానిక శాసనసభ్యులు సామినేని ఉదయభాను పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. 4,344 మంది పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయాలనే లక్ష్యం కాగా 4280 మంది పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు వైద్య అధికారి నాగరాణి తెలిపారు. **వన్‌టౌన్ :** ఇంద్రకీలాద్రిపై నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. రెడ్డి కాలనీ, ఊర్మిళ నగర్, స్కూల్‌లో దాదాపుగా 550 మంది చిన్నారులకు పోలియో చుక్కల మందు అంగన్వాడీ ఆశా వర్కర్లు సాయంత్రం 5 గంటల వరకు వేశారు. ఊర్మిళ నగర్ సిద్దెం కృష్ణారెడ్డి స్కూల్‌లో పోలియో చుక్కలు వేశారు. **కంచికచర్ల :** కంచికచర్ల మండలం పెండ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేసి పైల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. 5 ఏళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కంచికచర్ల సంజీవ నగర్‌లో ఎంపిటిసి బర్కంరె ఉదయ్ కిరణ్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కంచికచర్ల, పెండ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పరిధిలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలల్లో పోలియో చుక్కలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో 27 వార్డులో పల్స్ పోలియో కార్యక్రమాన్ని కొండపల్లి మున్సిపాలిటీ వైసిపి చైర్మన్ అభ్యర్థి గుంజ శ్రీనివాస్ ప్రారంభించారు. వార్డు కౌన్సిలర్ మామిళ్ళపల్లి చైతన్య స్రవంతి స్వయంగా తన బిడ్డతో పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్నారు. కొండపల్లి మున్సిపాలిటీ 3సచివాలయంలో పోలియో చుక్కలు వేశారు. జూపూడి గ్రామపంచాయతీలో నిండు వైస్ ఎంపిపి బాణావత్ నాగ బాలమ్మ, ప్రారంభించారు. **విస్సన్నపేట :** తెల్లదేవరపల్లి గ్రామంలో ఆదివారం పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు ప్రారంంచారు. ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి గ్రామ సర్పంచ్ రాయల నాగమణి సురేష్ పాల్గొన్నారు. పలు బూత్‌లలో ఆశా వర్కర్లు, టిడిపి నాయకులు, రాయల సురేష్ పాల్గొన్నారు.



విజయవాడలో



తిరువూరులో



గంపలగూడెంలో



జగ్గయ్యపేట

వ్యూహంలో వాస్తవాలను మాత్రమే చూపించా

దర్శకుడు రామ్ గోపాల్ వర్మ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలో వ్యూహం చిత్ర బృందం సందడి చేసింది. అనేక సెన్సార్ అడ్డంకులను దాటి మర్చి 2న రిలీజ్ అయిన వ్యూహం చిత్రం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడుతుందని డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ చెప్పారు. వాస్తవాలను మాత్రమే తెరకెక్కించాననీ, వ్యూహం పార్ట్ 2 శబదం సినిమాలో టిడిపి జనసేన పొత్తులపై కథ ఉంటుందనీ ఆయన తెలిపారు. వ్యూహం చిత్రం విడుదల నేపథ్యంలో డైరెక్టర్ రాంగోపాల్ వర్మ, చిత్ర యూనిట్ విజయవాడలోని జయరాం థియేటర్లో ఆదివారం సందడి చేశారు. అభిమానులు ఒక్కసారిగా రాంగోపాల్ వర్మను చుట్టుముట్టారు. అయితే వర్మ ఒక నిమిషం పాటు థియేటర్లో సినిమాను వీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... జగన్మోహన్ రెడ్డికి ఫేవర్ గానే ఈ సినిమా రూపొందించాననీ చెప్పారు. పవన్ కళ్యాణ్‌ని జోకర్లా నేను చూపించలేదనీ అన్నారు. వాస్తవాలను మాత్రమే తెరకెక్కించాననీ, లోకేష్ నిజ జీవితంలో ఎలా ఉంటారో అలాగే చూపించాననీ పేర్కొన్నారు. సెన్సార్ విషయంలో నాకు ఎలాంటి ఇబ్బంది కలగలేదన్నారు. వ్యూహం పార్ట్ 2 శబదం సినిమాలో టిడిపి జనసేన పొత్తులపై కథ ఉంటుందన్నారు. పవన్ కళ్యాణ్ 24 సీట్లు ఎలా ఎంచుకున్నారో పార్ట్ 2లో చూపిస్తామని చెప్పారు. లోకేష్ పేరుతో కేక్ కట్ చేయడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. 23 సంఖ్య వాళ్ళ లక్కీ నెంబర్ కాబట్టి 23 సార్లు కత్తితో కేక్ కట్ చేశాననీ చెప్పారు. అనంతరం వ్యూహం సినిమా హీరో అజ్మల్ మీర్ మాట్లాడుతూ....ఆర్జీవి పక్కన ఉంటే ఎలాంటి క్యారెక్టర్‌కు ప్రాక్టీస్ అవసరం లేదన్నారు. జగన్ మోహన్ రెడ్డి క్యారెక్టర్‌లో ఇమడడానికి పెద్దగా కష్టపడలేదన్నారు. సినిమా సక్సెస్ ఫుల్‌గా థియేటర్లలో రన్ అవుతుందన్నారు. తదనంతరం హీరోయిన్ మానస మాట్లాడుతూ....వైయస్ భారతినీ వ్యక్తిగతంగా ఎప్పుడూ కలవలేదన్నారు. కానీ ఆమె క్యారెక్టర్‌ని సులువుగా చేయగలిగాననీ చెప్పారు. నిర్మాత దాసరి కిరణ్ కుమార్ అభిమానుల నుండి పాజిటివ్ రెస్పాన్స్ వస్తుందన్నారు.



మాట్లాడుతున్న రామ్‌గోపాల్ వర్మ, పక్కన హీరో హీరోయిన్లు

ఎల్‌విపిఇఐ వ్యవస్థాపకులు డాక్టర్ రావుకు పురస్కారం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గుళ్ళపల్లి ఎన్.రావుకు వరల్డ్ ఐకాన్ 21 అవార్డు లభించింది. ఈ మేరకు విజయవాడ ఎల్‌విపిఇఐలో ఆదివారం ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. ఇటీవల ఇండోనేషియా బాలి నగరంలో నిర్వహించిన 39వ ఆసియా ఫసిఫిక్ అకాడమీ ఆఫ్ ఆప్తమాలజీ (ఏపీ ఏవో) సదస్సులో ఈ అవార్డును డాక్టర్ రావుకి అందజేసినట్టు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రతిభా వంతులైన 23 మంది నేత్ర వైద్య నిపుణులను 'వరల్డ్ ఐకాన్ 21 'అవార్డుతో సత్కరించారన్నారు. ఈ పురస్కారాల ఎంపిక ప్రక్రియలో డాక్టర్ ఎన్.రావు 10వ స్థానంలో నిలిచారన్నారు. 21వ శతాబ్దంలో నేత్ర సంరక్షణ రంగంలో కనపరచిన అసాధారణమైన ఉత్తమ కషికి ఫలితంగా ఆయనకు ఈ పురస్కారం లభించిందన్నారు. ఈ పురస్కారానికి ఎంపికైన మొదటి ఏకైక భారతీయుడుగా డాక్టర్ ఎన్.రావు నిలుస్తారన్నారు. ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గుళ్ళపల్లి ఎన్.రావు నేత్ర రంగంలో కళ్ళ సంరక్షణకు సంబంధించి చేసిన విశేష కృషికి 'ఆప్తమాలజి హాల్ ఆఫ్ ఫేమ్'లో ప్రవేశించటంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా పలు సంస్థల నుండి అనేక గౌరవ పురస్కారాలను సైతం పూర్వం అందుకున్నారన్నారు. డాక్టర్ రావు ఇంటర్నేషనల్ ఏజన్సీ ఫర్ ది ప్రివెన్షన్ ఆఫ్ బ్లైండ్ నెస్ (ఐఎపిబి) సంస్థ మాజీ చైర్మన్‌గా, అకాడమియా ఆప్తమాలజికల్ ఇంటర్నేషనల్స్ (ఏవో ఐ) సంస్థకు మాజీ అధ్యక్షులుగా సేవలందించారని చెప్పారు.

